DATE: 31-03-2022 RNI NO : TELTEL/2021/81092 prajamantalu, Jagitial

# ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక
ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు
prajamantalu.com

సంపుటి(Volume) : 3
సంచిక(Issue) : 03
పేజీలు - 08
వెల: రూ 5/-

గురువారం 31 మార్చి, 2022

tPublished From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



వాహనదారులకు మరో సదవకాశం
ట్రాఫిక్ చలానాల రాయితీ గడువు పొడిగింపు 2లో



బంగారంతో పోటీపడుతున్న మిర్చి
రికార్డు స్థాయిలో 52 వేల పలికిన ధర 2లో

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు
# శుభవార్త

### 31శాతం నుంచి 34శాతానికి డీఏ పెంపు



**న్యూఢిల్లీ,మార్చి30:** ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం గుడ్ న్యూస్ వినిపించింది. డియర్‌నెస్ అలోవెన్స్, డియర్‌నెస్ రిలీఫ్ ను 3శాతం పెంచుతూ.. 31శాతం నుంచి 34శాతానికి చేసినట్లు వెల్లడించింది. ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు కూడా ఈ పెంపుదల వర్తిస్తుందని బుధవారం ఇండియా టీవీ వెల్లడించింది. రీసెంట్ గా జరిగిన మార్పులు జనవరి 2022 నుంచి అమల్లోకి వస్తాయి. - మిగతా 2లో

## వరుసగా ఎనిమిదో రోజూ
# పెట్రో బాదుడు

### మరో 90పైసలు పెరిగిన ధరలు
### ఆందోళన చెందుతున్న వాహనదారులు



న్యూఢిల్లీ,మార్చి30: దేశవ్యాప్తంగా పెట్రో బాదుడు కొనసాగుతూనే ఉన్నది. గత మంగళవారం మార్చి 22 నుంచి ఒక్కరోజు మార్చి 24న మినహా ప్రతిరోజూ పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా పెరుగు తూనే ఉన్నాయి. దీంతో వాహనాలను బయటకు తీయాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు. దేశీయ చమురు కంపెనీలు ప్రతిరోజు అటూఇటుగా పెట్రో, డీజిల్‌పై 90 పైసల చొప్పున వడ్డిస్తూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. గత తొమ్మిది రోజుల్లో లీటరుపై మొత్తంగా రూ.5.60 భారం మోపాయి. పెట్రో బాదుడులో ఎనిమిదో రోజైన బుధవారం లీటరు పెట్రోలుపై 90 పైసలు, డీజిల్‌పై 87 పైసల చొప్పున పెంచాయి. దీంతో హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.114.51కి చేరగా, డీజిల్ ధర రూ.100 దాటింది. ప్రస్తుతం డీజిల్ రూ.100.70కు చేరింది. ఇలా పెట్రో ధరలు రోజూ భగ్గుమంటున్నాయి. వరుసగా 8వ రోజూ వాహనదారులకు షాకిచ్చాయి ఆయిల్ కంపెనీలు. పెట్రోల్‌పై 90 పైసలు, డీజిల్‌పై 87 పైసలు పెంచేశాయి. లేటెస్ట్ హైక్‌తో, హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర 114 రూపాయల 51 పైసలకు చేరింది. పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుల టెన్షన్‌ను పెంచుతున్నాయి. దేశంలోని ప్రధాన చమురు కంపెనీలు మార్చి 30 బుధవారం కొత్త పెట్రోల్, డీజిల్ ధరలను విడుదల చేశాయి. ఈరోజు మరోసారి దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ఇది వరుసగా రెండో వారం. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.114.52గా ఉంది. ఇదే సమయంలో లీటర్ డీజిల్ ధర రూ.100.71గా ఉంది. కరీంనగర్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.114.69గా ఉండగా.. లీటర్ డీజిల్ ధర ధర రూ.100.82గా ఉంది. ఖమ్మంలో పెట్రోల్ ధర రూ. 114.60గా ఉండగా.. డీజిల్ ధర రూ.100.77గా ఉంది. మెదక్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.114.63గా ఉండగా.. డీజిల్ ధర రూ.100.81గా ఉంది. రంగారెడ్డి జిల్లాలో లీటర్ పెట్రోల్ ధర రూ. 114.52 ఉండగా.. డీజిల్ ధర రూ.100.71గా ఉంది. వరంగల్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 114.02 పలుకుతుండగా.. లీటర్ డీజిల్ ధర రూ.100.23గా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని - మిగతా 2లో

## అవిశ్వాసానికి ముందే ఇమ్రాన్‌కు
# మరో షాక్

### మద్దతు ఉపసంహరించుకున్న ఎంక్యూఎం



**ఇస్లామాబాద్,మార్చి30:** అవిశ్వాస తీర్మానానికి ముందు అసెంబ్లీలో ఇమ్రాన్‌ఖాన్ మెజార్టీని కోల్పోయారు. అధికార పార్టీ ప్రధాన మిత్ర పక్షమైన ముతాహిదా ఖుయామి మూమెంట్ పాకిస్తాన్ (ఎంక్యూఎం-పి) ప్రతిపక్ష పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ(పిపిపి)కి మద్దతిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో అధికార పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్ ఇన్సాఫ్ (పిటిఐ) మెజార్టీని కోల్పోయింది. - మిగతా 2లో



## రాహుల్‌తో తెలంగాణ
# కాంగ్రెస్ నేతల భేటీ

### పీసీసీ చీఫ్ రేవంత్ సహా నేతలంతా హాజరు
### పాదయాత్ర కారణంగా హాజరు కాలేకపోయిన భట్టి

న్యూఢిల్లీ,మార్చి30: తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీతో న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ మేరకు ఢిల్లీకి నేతలంతా వెళ్లారు. పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి సహా నేతలంతా ఈ భేటీలో పాల్గొన్నారు. ఇటీవల 40 లక్షల మందికి కాంగ్రెస్ పార్టీ డిజిటల్ సభ్యత్వం ఇచ్చిన నేపథ్యంలో రాహుల్ గాంధీతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు సమావేశం అయ్యారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ఒక్కొక్కరికి రెండులక్షల బీమా చేయించనున్నారు. మొత్తం 40లక్షల మందికి ఆరున్నర కోట్ల రూపాయల ప్రీమియం చెక్కును రాహుల్ గాంధీ చేతుల మీదుగా బీమా సంస్థలకు రేవంత్ రెడ్డి బృందం అందజేయనుంది. అయితే ఈ నెలతో సభ్యత్వ నమోదు ప్రక్రియ ముగియనుంది. తెలంగాణలోని 32 వేల పోలింగ్ బూత్ లకుగాను 40 లక్షల మందికి సభ్యత్వం పొందారు. 80 లక్షల ఓట్లతో 90 స్థానాల్లో విజయం సాధించే దిశగా కాంగ్రెస్ వ్యూహం చేస్తున్నట్లు తెలుస్తోంది. దేశంలో అన్ని రాష్ట్రాల కంటే అత్యధిక సభ్యత్వం తెలంగాణ కాంగ్రెస్ చేసింది. ఇదిలా ఉంటే.. తెలంగాణ కాంగ్రెస్ వరి వరంగల్ పేరుతో సభ నిర్వహించనుంది. ఈ సభకు రాహుల్‌గాంధీ రానున్నట్లు - మిగతా 2లో

## రైతులతో కేంద్ర, రాష్ట్రాల చెలగాటం

- కాంగ్రెస్ వల్లనే రైతులకు మేలు జరిగింది
- కాంగ్రెస్ ఏం చేసిందో డ్రామారావుకు తెలియదు
- రాహుల్‌పై విమర్శలను తిప్పికొట్టిన రేవంత్

**హైదరాబాద్,మార్చి30:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులతో చెలగాటం ఆడుతున్నాయని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు అన్ని విధాల న్యాయం చేశామన్నారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఎన్నో చట్టాలను మార్చి రైతులకు మద్దతు ధర ఇచ్చామన్నారు. కేటీఆర్ విలాసవంతమైన టూర్లకు వెళ్లొచ్చారన్నారు. కాంగ్రెస్ దేశానికి ఏం చేసిందని డ్రామారావు ఎదురుదాడి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ దేశానికి ఏం చేసిందనేది డ్రామారావుకు అవగాహన లేదన్నారు. దేశంలోని ప్రధాన ప్రాజెక్టులను కట్టింది - మిగతా 2లో

## దంచి కొడుతున్న
# ఎండలు

### నిప్పుల కుంపటిలా రాష్ట్రం

- 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు
- ఎండల తీవ్రతతో అప్రమత్తమైన ప్రభుత్వం
- అధికారులతో సీఎస్ టెలి కాన్ఫరెన్స్
- తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిక
- దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు
- ఢిల్లీతోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో భారీగా ఎండలు
- మరింత పెరిగే అవకాశం ఉందని ఐఎండి హెచ్చరిక



హైదరాబాద్,మార్చి30: భానుడు విశ్వరూపం చూపిస్తున్నాడు. వేసవి ఆరంభంలోనే భగభగమంటూ చెమటలు కక్కిస్తున్నాడు. ఉదయం నుంచే ఎండ, ఉక్కపోతకు తోడు మధ్యాహ్నం సమయంలో వడ గాలులు వేడి పుట్టిస్తున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో ఏపీలో పలు ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల

- మిగతా 2లో

## హైడ్రోజన్ కారులో పార్లమెంటుకు గడ్కరీ

2లో




## బాయిల్డ్ రైస్ సేకరించేది లేదు

### మరోమారు స్పష్టం చేసిన కేంద్రం



న్యూఢిల్లీ,మార్చి30: రాష్ట్రాల నుంచి బాయిల్డ్ రైస్ సేకరించేది లేదని కేంద్ర ప్రభుత్వం మరోసారి పునరుద్ఘాటించింది. లోక్‌సభలో ఎంపీ దుష్యంత్ సింగ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. అవసరాల రీత్యా రాష్ట్రాలే బాయిల్డ్ రైస్ సేకరించుకోవాలని సూచించారు. కేంద్రం తరపున మాత్రం సేకరించేది లేదని స్పష్టం చేశారు. ఇకపై బాయిల్డ్ రైస్ సేకరించబోమని గత ఖరీఫ్‌లోనే చెప్పామని గుర్తు చేశారు. 2020-21 ఖరీఫ్‌లో 47.49 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్‌ను, 6.33 లక్షల మెట్రిక్ టన్నుల రా రైస్‌నుసేకరించామని సాధ్వి నిరంజన్ జ్యోతి తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య - మిగతా 2లో

## ప్రజానాడి



## ఐసెట్ నోటిఫికేషన్ విడుదల

### జూలై 27, 28న ఐసెట్ పరీక్ష

హైదరాబాద్,మార్చి30: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం 2022- 23 ఐ-సెట్ నోటిఫికేషన్ విడుదలైంది. వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబ్రాది, కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి రమేశ్ బుధవారం



విడుదల చేశారు. మొత్తం 14 రీజినల్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు లింబ్రాది తెలిపారు. ఏప్రిల్ 6 నుంచి జూన్ 27 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. రూ.1000 అపరాధ రుసుముతో జూలై 23 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. జూలై 27, 28 రెండు రోజుల పాటు పరీక్ష నిర్వహిస్తామని, పరీక్ష ఫలితాలను ఆగస్ట్ 22న విడుదల చేయనున్నట్లు వివరించారు.

# స్కూళ్లకు వేసవి సెలవలు

### జూన్ 12నుంచి స్కూల్స్ రీఓపెన్
### నేటి నుంచి పాఠశాలల సమయం కుదింపు
### ఉ.11.30 గంటల వరకే స్కూళ్లు
### 7నుంచి వార్షిక పరీక్షలు
### ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ డైరెక్టర్

**హైదరాబాద్,మార్చి30:** తెలంగాణలోని అన్ని పాఠశాలలకు కూడా ఏప్రిల్ 24 వ తేదీ నుంచి వేసవి సెలవులు ఉంటాయని పాఠశాలల విద్యాశాఖ తెలిపింది. మళ్లీ జూన్ 12 వ తేదీ నుంచి స్కూల్స్ రీ ఓపెన్ అవుతాయని విద్యాశాఖ తెలియజేసింది. అలాగే వచ్చే నెల 7వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కూడా ఒకటో - మిగతా 2లో



## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు
# శుభవార్త

మొదటిపేజీ తరువాయి..

పెరిగిన డీఏ, డీఆర్ లు 47.68 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 68.62లక్షల మంది పెన్షనర్లకు బెనిఫిట్ కానున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ మీటింగ్ తర్వాతే 2022 జనవరి 1నుంచి మార్పులు అమలవుతాయని ప్రకటించారు. "ఈ పెంపు 7వ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల ఆధారంగా ఆమోదించబడిన ఫార్ములాకు అనుగుణంగా ఉంది" అని పేర్కొంది. డియర్‌నెస్ అలవెన్స్, డియర్‌నెస్ రిలీఫ్ రెండింటి ద్వారా ఖజానాపై ఉమ్మడి ప్రభావం సంవత్సరానికి రూ.9వేల 544.50 కోట్లుగా ఉంటుంది. తొమ్మిది రోజులుగా పెట్రోల్, డీజిల్ ధరలను చమురు కంపెనీలు లీటరుకు 5 రూపాయలకు పైగా పెంచిన తరుణంలో ఈ పెంపు జరిగింది. ఆకాశాన్నంటుతోన్న ఇంధన ధరలు, ద్రవ్యోల్బణం మధ్య కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ పెంపు చాలా ఉపశమనాన్ని అందించనుందని విశ్లేషకులు అంటున్నారు.

## బంగారంతో పోటీపడుతున్న మిర్చి

**రికార్డు స్థాయిలో 52 వేల పలికిన ధర**
**ఆనందంలో ఉన్న మిర్చి రైతులు**

వరంగల్,మార్చి30: మిర్చి ధర పసిడితో పోటీపడుతున్నది. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో దేశీ రకం మిర్చి రికార్డు స్థాయిలో ధర పలుకుతున్నది. దేశీయ మిర్చికి క్వింటాల్‌కు ధర రూ.



52 వేలు పలుకుతున్నది. కొద్ది రోజుల క్రితం ఈ మార్కెట్లో దేశీ రకం మిర్చి క్వింటాల్ ధర రూ. 48 వేలు పలికింది. ఇప్పుడు ఆ రికార్డును బ్రేక్ చేసింది. ములుగు మండలం ఎస్ నగర్ గ్రామానికి చెందిన రైతు బల్గూరి రాజేశ్వరరావు 7 బస్తాల మిర్చిని ఎనుమాముల మార్కెట్‌కు తీసుకొచ్చారు. దీనికి మార్కెట్‌లోని లాల్ ట్రేడింగ్ కంపెనీ ఖరీదుదారులు ధర రూ. 52 వేలు నిర్ణయించారు. ఇప్పటివరకు ఇదే ఆల్ టైమ్ రికార్డు అని మార్కెట్ వర్గాలు తెలిపాయి. కాగా, మిర్చికి భారీ ధర పలుకుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో మిర్చికి మంచి ధర పలకడంతో ఇదే సమయంలో విక్రయించేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ధర అధికంగా ఉన్న చోటికి తమ పంటలను తరలిస్తున్నారు. మార్కెట్‌లో మంచి ధర పలకడంతో రాయలసీమ రైతులు ఫుల్ ఖుషీగా ఉన్నారు. దేశంలోనే కొత్త రికార్డును నమోదు చేసింది. గోల్డ్ రేట్‌ను క్రాస్ చేసింది. తులం బంగారం 50వేలు ఉంటే.. క్వింటా దేశీ మిర్చ 52వేలకు చేరుకుంది. ఇది దేశంలో రికార్డు ధర. గతంలో ఎన్నడూ లేని ఈ ధరను చూసి రైతులే షాక్ తింటున్నారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఈ రికార్డు ధరలు నమోదవు తున్నాయి. మొన్నటి వరకు క్వింటా 50 వేలు ఉన్న ధర ఒక్కసారిగా 52 వేలకు చేరుకుంది. ఇది దేశీయ మార్కెట్ చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డ్ అని రైతులు అంటున్నారు. పంటను మార్కెట్‌కు తీసుకొస్తున్న రైతులు ధరలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. పొలాల్లో ఉత్పత్తి తక్కువగా వచ్చినా.. ఈ రికార్డు ధరలను చూస్తున్న అన్నదాత కళ్లలో ఆనందం కనిపిస్తోంది. అటు.. పత్తికి సైతం రికార్డు రేట్లు పలుకుతున్నాయి. నిర్మల్ జిల్లా భైంసా మార్కెట్‌లో తెల్ల బంగారానికి ఆల్ టైమ్ రికార్డు ధర పలుకుతోంది. క్వింటా పత్తి ధర 11వేలు దాటింది. ఇవాళ క్వింటా పత్తి ధర ఏకంగా 11వేల 2 వందలకు చేరింది. పక్కన ఉన్నమహారాష్ట్రలోని ధర్మబాద్ మార్కెట్‌లో 12వేలు పలుకుతోంది.

### టిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత

జనగామ,మార్చి30: దేవరుప్పుల మండలం చిన్న మడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాంపెల్లి శ్రీనివాస్ టీఆర్ఎస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌కు గులాబీ కండువా కప్పి మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత గౌరవం లభిస్తుందన్నారు.

## వాహనదారులకు మరో సదవకాశం

**ట్రాఫిక్ చలానాల రాయితీ గడువు పొడిగింపు**
**మరో 15 రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయం**
**భారీగా క్లీయరెన్స్ అవుతున్న చలాన్లు**

హైదరాబాద్,మార్చి30: తెలంగాణ వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఊరటనిచ్చింది. పెండింగ్‌లో ఉన్న చలాన్ల పై ఇచ్చిన రాయితీ గడువును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మరో 15 రోజుల పాటు పొడిగిస్తున్నామని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు పెండింగ్ చలాన్ల గడువు మార్చి 1 నుండి 31వ తేదీ వరకు పెంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. పెండింగ్ చలాన్ల చెల్లింపునకు గానూ ఇప్పటి వరకు వాహనదారుల నుంచి స్పందన లభించిందన్నారు. దీంతో రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూరిందన్నారు. ట్రాఫిక్ చలానాల రాయితీ సదవకాశాన్ని ఉపయోగించుకొని రాష్ట్ర వ్యాప్తంగా 2.40 కోట్ల చలాన్లు చెల్లింపు జరిగిందని హోంమంత్రి తెలిపారు. వీటి విలువ 840 కోట్ల రూపాయలని తెలియజేశారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఇప్పటివరకు 250 కోట్ల రూపాయలు చెల్లించి పెండింగ్ చలానా క్లియర్ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 52% మోటారు వాహన యజమానులు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయానికి విశేష స్పందన రావడంతో పాటు ఈ అవకాశాన్ని పొడిగించాలని అనేక విజ్ఞప్తులు వచ్చినందున ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి మరో 15 రోజుల పాటు 15-04-2022) పెండింగ్ చలానాలపై రాయితీ అవకాశాన్ని పొడిగించామని వివరించారు. ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ రెండు సంవత్సరాలుగా కరోనా వల్ల పేదలు, మధ్య తరగతి వారు ప్రజలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు హోంమంత్రి తెలిపారు. ఇంతవరకూ చలాన్లు చెల్లించలేక పోయినవారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఈ-చలాన్ వెబ్సైట్ లో ఆన్లైన్ పేమెంట్ ద్వారా తమ చలాన్ క్లియర్ చేసుకోవాల్సిందిగా రాష్ట్ర హోం మంత్రి తెలిపారు. ఇంతవరకూ చలాన్లు చెల్లించలేక పోయినవారు ఈ రాయితీ అవకాశాన్ని ఉపయోగించుకుని ఈ-చలాన్ వెబ్సైట్ లో ఆన్లైన్ పేమెంట్ ద్వారా తమ చలాన్ క్లియర్ చేసుకోవాల్సిందిగా రాష్ట్ర హోం మంత్రి తెలిపారు.



## అవిశ్వాసానికి ముందే ఇమ్రాన్‌కు
# మరో షాక్

మొదటిపేజీ తరువాయి..

ప్రతిపక్షాల కూటమితో ఎంక్యూఎం ఒప్పందం కుదుర్చుకుందని, రాబ్తా కమిటీ ఎంక్యూఎం, పిపిసి సిఇసి ఈ ఒప్పందాన్ని ఆమోదిస్తుందని.. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం మధ్యాహ్నం మీడియా సమావేశంలో వెల్లడిస్తామని పిపిపి చైర్మన్ బిలావల్ భుట్టో జర్దారి మంగళవారం రాత్రి ట్విటర్‌లో ప్రకటించారు. ఈ మధ్యాహ్నం ఎంక్యూఎం పార్టీకి చెందిన మంత్రులు, సభ్యులు తమ పదవులకు రాజీనామా చేయనున్నట్లు సమాచారం. దీంతో అసెంబ్లీలో ఇమ్రాన్‌ఖాన్ బలం మరింత తగ్గనుంది. పాక్ సంకీర్ణ ప్రభుత్వంలో పిటిఐకి ప్రధాన మిత్ర పక్షం ఎంక్యూఎంపినే. ఈ పార్టీకి చెందిన ఏడుగురు సభ్యులు ఇప్పటివరకు ప్రభుత్వానికి మద్దతుగా ఉండటంతో పాటు మంత్రులుగానూ కొనసాగుతున్నారు. అయితే ఇప్పుడు ఎంక్యూఎంపి ప్రతిపక్షానికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించడంతో ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం మెజార్టీ మార్క్‌ను కోల్పోనుంది. ఎంక్యూఎంపి సభ్యులు రాజీనామా చేస్తే ఇమ్రాన్ ప్రభుత్వ బలం 164కు తగ్గుతుంది. అదే సమయంలో ప్రతిపక్షాల బలం 176కు పెరగనుంది. ఇమ్రాన్ ఖాన్ పార్టీ పిటిఐకి చెందిన 24 మంది సభ్యులు కూడా ఇమ్రాన్‌పై తిరుగుబాటు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇమ్రాన్‌ఖాన్‌పై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మార్చి 31న చర్చ జరగనుంది. ఏప్రిల్ 3 ఆదివారం దీనిపై ఓటింగ్ నిర్వహించనున్నారు. అయితే ప్రస్తుత సభ్యుల సంఖ్య ప్రకారం ఇమ్రాన్‌ఖాన్‌పై ప్రతిపక్షాల అవిశ్వాసం నెగ్గేలా కన్పిస్తోంది. 342 మంది సభ్యులున్న పాకిస్తాన్ అసెంబ్లీలో ఇమ్రాన్ ఖాన్ తన బలాన్ని నిరూపించుకోవాలంటే 172 మంది సభ్యుల మద్దతు అవసరం.

## హైడ్రోజన్ కారులో పార్లమెంటుకు గడ్కరీ




న్యూఢిల్లీ,మార్చి30: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మన దేశంలోనే తొలి గ్రీన్ హైడ్రోజన్ పవర్డ్ కారులో తన నివాసం నుంచి పార్లమెంటుకు ప్రయాణించారు. ఇది భావి భారత కారు అని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ కారును ప్రశంసించారని చెప్పారు. స్వయం సమృద్ధ భారతదేశంగా మారే దిశగా ఇది పెద్ద ముందడుగు అని తెలిపారు. పెట్రోలు, డీజిల్ వల్ల కాలుష్యం వస్తోందని, హైడ్రోజన్ సెల్ కార్ల వల్ల కాలుష్యం రాదన్నారు. హైడ్రోజన్‌లో మూడు రకాలు ఉన్నాయని, ఈ కారు కోసం వాడుతున్నది గ్రీన్ హైడ్రోజన్ అని చెప్పారు. ఈ కారులో ప్రయాణానికి కిలోమీటరుకు రూ.1.50 ఖర్చవుతుందని తెలిపారు. గడ్కరీ ఈ నెల 16న ఇచ్చిన ట్వీట్‌లో, భారత దేశాన్ని ఇంధన స్వయంసమృద్ధం చేసేందుకు సమగ్ర, పర్యావరణహితకర, సుస్థిర ఇంధన మార్గం గ్రీన్ హైడ్రోజన్ అని తెలిపారు. భారత దేశ తొలి హైడ్రోజన్ ఆధారిత ఆధునిక ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్ వాహనం ÷నానీబిజీ ఓతిసజీతిను గడ్కరీ ఆవిష్కరించారు. జనవరిలో ఆయన మాట్లాడుతూ, హైడ్రోజన్ పవర్డ్ కారును తాను స్వయంగా ఉపయోగిస్తానని చెప్పిన సంగతి తెలిసిందే.

## బాయిల్డ్ రైస్ సేకరించేది లేదు

మొదటిపేజీ తరువాయి..

ఆరోపణల పర్వం కొనసాగుతున్న క్రమంలో కేంద్రం ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నేపథ్యంలో బాయిల్డ్ రైస్‌పై మరోసారి కేంద్ర ప్రభుత్వం తన విధానాన్ని కుండబద్దలు కొట్టినట్టుగా చెప్పేసింది.. రాష్ట్రాల నుంచి బాయిల్డ్ రైస్ సేకరించేది లేదని లోక్‌సభలో స్పష్టం చేసింది. ఎంపీ దుష్యంత్ సింగ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. బాయిల్డ్ రైస్ సేకరించబోమని గత ఖరీఫ్‌లోనే స్పష్టంగా చెప్పామని ఈ సందర్భంగా గుర్తుచేసారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వార్ నడుస్తుండగా.. కేంద్ర మంత్రి ప్రకటన అగ్గికి ఆజ్యం పోసినట్టుగా తయారైంది.

## వరుసగా ఎనిమిదో రోజూ
# పెట్రో బాదుడు

మొదటిపేజీ తరువాయి..

ప్రధాన నగరాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు ఇలావున్నాయి. విజయవాడలో లీటర్ పెట్రోల్ రూ.116.39కు లభిస్తుండగా.. లీటర్ డీజిల్ ధర రూ.102.09లకు లభిస్తోంది. విశాఖపట్నంలో పెట్రోల్ ధర రూ.115.42 ఉండగా.. డీజిల్ ధర రూ. 101.27గా ఉంది. విజయనగరంలో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58 లకు లభిస్తుండగా.. డీజిల్ ధర రూ.101.42గా ఉంది. కృష్ణా జిల్లాలో లీటర్ పెట్రోల్ ధర రూ. 116.25గా ఉండగా.. డీజిల్ ధర రూ.102.09గా ఉంది. గుంటూరు జిల్లాలో లీటర్ పెట్రోల్ రూ.116.39లకు లభిస్తుండగా.. డీజిల్ రూ.102.42లకు లభిస్తోంది.

దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఇలావున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలోని లీటర్ పెట్రోల్ ధర రూ.101.01 గా ఉండగా.. లీటర్ డీజిల్ ధర రూ. 92.27 లకు లభిస్తోంది. ఇదే సమయంలో దేశ ఆర్థిక రాజధాని ముంబైలో లీటర్ పెట్రోల్ ధర రూ.115.88కు లభిస్తుండగా.. లీటర్ డీజిల్ ధర రూ.100.10 ఉంది. కోల్‌కతాలో పెట్రోల్ ధర రూ.110.52 చొప్పున ఉండగా.. డీజిల్ ధర రూ. 95.42 గా ఉంది. చెన్నైలో పెట్రోల్ ధర రూ. 106.88 ఉండగా.. డీజిల్ ధర రూ.96.76గా ఉంది. బెంగళూరులో లీటర్ పెట్రోల్ ధర రూ.106.46 పలుకుతుండగా.. డీజిల్ ధర రూ.90.49గా ఉంది. లక్నోలో లీటర్ పెట్రోల్ ధర రూ. 100.86 ఉండగా.. లీటర్ డీజిల్ ధర రూ.96.76గా ఉంది. ఇక దేశరాజధాని న్యూఢిల్లీలో 80 పైసల చొప్పున పెరగడంతో పెట్రోల్ రూ.101.01కి చేరగా, డీజిల్ రూ.92.27కు, ముంబైలో పెట్రోల్ రూ.115.88 (84 పైసలు), డీజిల్ రూ.100.10 (85 పైసలు), చెన్నైలో పెట్రోల్ రూ.106.69 (75 పైసలు), డీజిల్ రూ.96.76 (76 పైసలు), కోల్‌కతాలో పెట్రోల్ రూ.110.52 (84 పైసలు), డీజిల్ రూ.95.42 (80 పైసలు)గా ఉన్నాయి.

## రాహుల్‌తో తెలంగాణ
# కాంగ్రెస్ నేతల భేటీ



మొదటిపేజీ తరువాయి..

ప్రచారం జరుగుతోంది. ఈ భేటీకి సీఎల్పీనేత మల్లు భట్టి విక్రమార్క గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నాయకులతో నిర్వహించే సమావేశానికి తాను ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న సందర్భంగా రాలేకపోతున్నానని, అధిష్టానానికి ముందస్తు సమాచారం ఇచ్చినట్లు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కొరకు మధిర నియోజకవర్గంలో గత నెల 27 నుంచి పీపుల్స్ మార్చ్ పేరిట పాదయాత్ర నిర్వహిస్తున్నానన్నారు. పాదయాత్ర పూర్తి అయిన తర్వాత వచ్చి కలుస్తాను అని అధినేతకు సమాచారం ఇచ్చి అనుమతి తీసుకున్నందునే ఈ రోజు ఢిల్లీలో జరిగే ముఖ్య నాయకుల సమావేశానికి వెళ్లలేదన్నారు. పాదయాత్ర ముగించుకున్న తర్వాత ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ గారిని కలుస్తానని వెల్లడించారు.

## రైతులతో కేంద్ర, రాష్ట్రాల చెలగాటం

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్సేనన్నారు. హరిత విప్లవాన్ని తీసుకొచ్చి ఎన్నో ప్రాజెక్టులు నిర్మించిందన్నారు. రైతుకు కనీస మద్దతు ధర విధానం తెచ్చింది కాంగ్రెస్సేనన్నారు. ఎస్సెన్షియల్ కమాడిటీ యాక్ట్ తెచ్చింది కూడా కాంగ్రెస్సే అని అన్నారు. మండి విధానాలు, రైతులకు ఉచిత కరెంట్ కల్పించింది కాంగ్రెస్ అని అన్నారు. దేశంలో రూ. 70 వేల కోట్ల రుణమాఫీ చేసింది కూడా కాంగ్రెస్సేనన్నారు రేవంత్. టీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ను తక్కువ చేసి మాట్లాడుతున్నారన్నారు. దేశానికి కాంగ్రెస్ ఎంతో చేసిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 7 వేల మంది రైతులు చనిపోయారన్నారు. రైతుల కోసం కాంగ్రెస్ ఎన్నో సంక్షేమ పథకాలు తెచ్చిందని, దేశంలో హరిత విప్లవం తీసుకొచ్చిందీ కాంగ్రెసేనని రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ చరిత్ర, దేశ చరిత్రపై ఎలాంటి అవగహన లేదని విమర్శించారు. తెలంగాణలో కుటుంబ పాలన సాగుతోందని, రైతులను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంతో తాడోపేడో తేల్చుకుంటామన్న ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బాయిల్డ్ రైస్ సరఫరా చేయబోమని కేసీఆర్ సంతకం పెట్టారని, సమస్య జఠిలం అవ్వడానికి సీఎం వైఖరే కారణమని రేవంత్ రెడ్డి విమర్శించారు. ధాన్యం కొనుగోలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రామాలాడుతున్నాయని దుయ్యబట్టారు. ప్రతిగింజ కొనాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. రాహుల్‌పై టీఆర్ఎస్ విమర్శలు చేయడం సరికాదని రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఏం చేసిందని డ్రామారావు ఎదురుదాడి చేస్తున్నారని ప్రశ్నిం చారు. రుణమాఫీ చేసి రైతు కుటుంబాలను ఆదుకుంది కాంగ్రెస్ అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని విమర్శించారు. ఎన్నో చోట్ల సవరణలు చేసి పంటలకు మద్దతు ధర కల్పించామని, ప్రాణహిత చేవెళ్ల పేరు మార్చి రకరకాల పేర్లతో దోపిడీ చేస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు.

తెలంగాణ రైతుల కోసం కాంగ్రెస్ పార్టీ అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. రాహుల్ గాంధీచేసిన ట్వీట్ పై టీఆర్ఎస్ నేతలు పోటీ పడి కామెంట్స్ చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా చేసిన సూచనలు పరిగణలోకి తీసుకుంటారని భావించాం. కేటీఆర్ ఎదురు దాడి చేస్తున్నారు. కాంగ్రెస్ గురించి, ఈ దేశం గురించి కేటీఆర్ కు అవగాహన లేదు. దేశానికి కాంగ్రెస్ ఏం చేసిందో చెప్తున్నా, నిజమో కాదో, తండ్రి కేసీఆర్ ను అడిగి కేటీఆర్ తెలుసుకోవాలన్నారు. కేటీఆర్ కు గాంధీ కుటుంబానికి పోలిక ఉందా? బాయిల్డ్ రైస్ ఫుడ్ కార్పోరేషన్ కి సరఫరా చెయ్యమని సంతకం పెట్టింది కేసీఆర్. రైతులకు బియ్యంతో సంబంధం లేదు. తెలంగాణ రైతుల పంటను కొనాల్సిన నైతిక బాధ్యత రాష్ట్ర సర్కారుదే. కేంద్ర ప్రభుత్వాన్ని దోషిగా చూపెట్టేందుకు , రైతులను ఫణంగా పెడుతున్నారు. రైతుల పట్ల కేసీఆర్ కు చిత్తశుద్ధి ఉంటే, జంతర్ మంతర్ లో ఆమరణ దీక్ష చెయ్యాలన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రభుత్వంపై అలుపెరగని పోరాటం చేస్తాం. తెలంగాణ లో జరిగే కాంగ్రెస్ ప్రజాఉద్యమాల్లో రాహుల్ గాంధీ, ప్రత్యక్షంగా పాల్గొంటారు. ఛత్తీస్‌ఘడ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా ఉందన్నారు.



# స్కూళ్లకు వేసవి సెలవలు

మొదటిపేజీ తరువాయి..

తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న పాఠశాల విద్యార్థులకు ఎస్సే -టు ఎగ్జామ్స్ అనేవి ఉంటాయి. వచ్చే నెల 23వ తేదీన ఫలితాలను ప్రకటిస్తారు. ఇక ఈ విద్యా సంవత్సరానికి ఏప్రిల్ 23 వ తేదీ చివరి పని దినంగా ఉంటుంది. కాగా మే 23 వ తేదీ నుంచి మే 28వ తేదీ వరకు కూడా పదవ తరగతి వార్షిక పరీక్షలు జరగనున్నాయి.అలాగే నేటినుంచి పాఠశాలల సమయాలను ప్రభుత్వం తగ్గించింది. వేసవి తీవ్రత దృష్ట్యా పాఠశాలలను గురువారం నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు ఉదయం 8గంటల నుంచి 11:30 గంటల వరకు మాత్రమే నడపాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

## దంచి కొడుతున్న
# ఎండలు

మొదటిపేజీ తరువాయి..

నిర్వహణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలోని కొన్నిచోట్ల ఇవాళ కూడా వడగాలులు వీచే అవకాశం ఉందని తాజా ప్రకటనలో పేర్కొంది. తెలంగాణలోనూ పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా చాప్రాలలో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గత పదేళ్ల మార్చి ఉష్ణోగ్రతల్లో ఇది కొత్త రికార్డ్. ఎల్లుండి వరకు రాష్ట్రంలో సాధారణం కన్నా 3 డిగ్రీల వరకు అధికంగా ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. విదర్భ నుంచి కేరళ వరకూ గాలులతో ఉపరితల ద్రోణి 900 మీటర్ల ఎత్తున కొనసాగుతోంది. దీంతో ఎండల తీవ్రత పెరుగుతోంది. ఎండవేడి కారణంగా నల్గొండ ప్రాంతంలో గాలిలో తేమ సాధారణం కన్నా 24 శాతం తక్కువై పొడి వాతావరణం ఏర్పడింది. ఎండ తీవ్రతతో ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వడగాల్పులతో ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో 44 నుంచి 46 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరగవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ప్రజలు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. మరోవైపు ఎండల తీవ్రతతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. అధికారులను అప్రమత్తం చేసింది. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత ఎక్కువవుతుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో నెలకొని ఉన్న తీవ్ర ఎండల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ, డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖల అధికారులతో సోమేశ్ కుమార్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రానున్న రెండురోజుల్లో ఉత్తర తెలంగాణా జిల్లాలతోపాటు నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్ తదితర జిల్లాల్లో రెండు నుండి నాలుగు డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, అన్ని ఆసుపత్రుల్లో వైదులు, సిబ్బందిని అప్రమత్తం చేయాలని అన్నారు. అదేవిధంగా సరిపడా ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. ఎండ తీవ్రత వల్ల ఏవిధమైన ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఎండల ప్రభావం వల్ల కలిగే ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్య ప్రర్చాలని సీఎస్ కలెక్టర్లను ఆదేశించారు. అన్ని జిల్లాల్లో 108 వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న పాఠశాల సమయాన్ని మరింత తగ్గించాలని, అదేవిధంగా ఉపాధి హామీ కూలీలు ఎండలో పని చేయకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అగ్నిమాపక శాఖను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో అన్ని జిల్లాల కలెక్టర్లతోపాటు ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వి, పంచాయతీ రాజ్, విద్యా శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, డిజాస్టర్ మేనేజ్మెంట్ కమిషనర్ మాణిక్ రాజ్, భారత వాతావరణ శాఖ డైరెక్టర్ నాగరత్న లు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాష్ట్రంలో జీవో 58, 59ల కింద ఇళ్ల పట్టాలను క్రమబద్ధీకరణ చేస్తున్నామని సీఎస్ సోమేష్‌కుమార్ తెలిపారు. ఈ క్రమబద్ధీకరణకు మార్చి 31 తుది గడువు అని ఆయన పేర్కొన్నారు. బుధవారంసాయంత్రం బీఆర్కే భవన్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఆరోగ్యశాఖ సెక్రటరీ, విపత్తు నిర్వహణ అధికారులతో సీఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ జీవో 58 కింద 87,520 దరఖాస్తులు వచ్చాయన్నారు. జీవో 59 కింద 59,748 దరఖాస్తులు వచ్చాయన్నారు. మొత్తం 1,47,268 దరఖాస్తులు



అందాయని సీఎస్ తెలిపారు. వచ్చే ఐదు రోజుల్లో ఢిల్లీతోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో ఎండలు భారీగా పెరగనున్నట్లు 'ఐఎమ్‌డీ' ప్రకటించింది. వాయువ్య భారతం, మధ్య, పశ్చిమ రాష్ట్రాల్లో వడగాడ్పులు ఎక్కువగా నమోదు కావొచ్చని ఐఎమ్‌డీ తెలిపింది. గురువారం నుంచి ఐదు రోజులపాటు ఎండలు సగటున 40 డిగ్రీలకంటే ఎక్కువగా నమోదవుతాయని వెల్లడించింది. రాజస్థాన్-పాకిస్తాన్ సరిహద్దులోని యాంటీ సైక్లోన్ సిస్టమ్ వల్ల ఎండలు ఎక్కువగా పెరుగుతున్నాయని ఐఎమ్‌డీ తెలిపింది. మార్చి నెలాఖరులోనే ఎండలు ఎక్కువగా ఉంటే, రాబోయే కాలంలో మరింతగా పెరిగే అవకాశం ఉంది.




జగిత్యాల నుండి కటక్ లో అఖిల భారత కన్స్ట్రక్షన్ మజ్దూర్ మహాసంఘ్ జాతీయ మహాసభలలో పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎదులాపురం సత్యనారాయణ

## ఉన్నత లక్ష్యంతో చదివినప్పుడే విజయం సాధ్యం

**జిల్లా ఎస్పీ సింధు శర్మ**



**జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు):** ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని, పక్కా ప్రణాళికతో, మారిన పరిస్థితులు కు అనుగుణంగా ప్రిపరేషన్ ప్రారంభిస్తే తప్పకుండా ఉద్యోగం సాధించవచ్చని జిల్లా ఎస్పీ సింధు శర్మ ఐపీఎస్ అన్నారు. ఈరోజు స్థానిక విరుపాక్షి గార్డెన్లో లో నిరుద్యోగ యువతీ, యువకుల కొరకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రీ కోచింగ్ అవగాహన సదస్సును జిల్లా అదనపు ఎస్పీ చే కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... రాష్ట్ర డీజీపీ ఎం. మహేందర్ రెడ్డి ఐపీఎస్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పోలీస్ ఉద్యోగాల గురించి నిరుద్యోగ యువతీ, యువకులకు అవగాహన కల్పించడంతో పాటు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఉచిత శిక్షణ కొరకు జిల్లాలో సుమారు 1800 మంది అభ్యర్థులు తమ యొక్క పేర్లు నమోదు చేసుకోవడం జరిగిందని ఇందుకు గాను నిర్వహిచిన అర్హత పరీక్ష (స్క్రీనింగ్ టెస్ట్) ఉత్తీర్ణత సాధించిన 435 మంది అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి మొదటగా అవుట్డోర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీస్ సెలక్షన్ ప్రాసెస్ గురించి మరియు ఎగ్జామ్ పేపర్ ను గురించి మరియు చదవాల్సిన బుక్స్ గురించి ఈ యొక్క అవగాహన సదస్సులో నిపుణులైన వారిచే తెలియజేయడం జరుగుతుందన్నారు. పోలీస్ సెలక్షన్ ప్రాసెస్ అనేది ప్రిలిమినరీ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, అండ్ ఫైనల్ ఎగ్జామ్ మూడు దశలో ఉంటుందని ఇందులో నిర్దిష్ట ప్రణాళికతో, సరైన అవగాహనతో ముందుకు వెళితేనే ఉద్యోగం సాధించవచ్చని అన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగాలకు చాలా కాంపిటీషన్ ఉందని కావున సమయాన్ని అందరూ సరైన విధంగా ఉపయోగించుకుంటూ మారిన పరిస్థితులకు అనుగుణంగా ప్రిపరేషన్ చేసుకోవాలని సూచించారు. కొద్దిరోజుల పాటు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సోషల్ మీడియాను, సెల్ ఫోన్ ను ఎంత వరకు అవసరమో అంతే మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ యొక్క కార్యక్రమంలో అదనపు ఎస్పీ రూపేష్ ఐపిఎస్, డిఎస్పి లు ప్రకాష్, రవీందర్ రెడ్డి, రాఘవేంద్రరావు, మరియు సి.ఐ లు, ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీఆర్ నగర్ అంగన్వాడీ కేంద్రం, తారక రామ పార్కును పరిశీలించిన ఎమ్మెల్యే



**జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ పరిధి టీఆర్ నగర్ లోని అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. చిన్నారులకు మౌళిక వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకుని వారికి అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి చిన్నారులతో కాసేపు గడిపారు. అనంతరం టిఆర్ నగర్ లో ఎలాంటి పట్టాలు లేకుండా ప్రభుత్వ భూమిలో నివాసం ఏర్పరచుకున్న నిరుపేదలు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను కలిసి పట్టాలు ఇప్పించాలని కోరగా జీఓ 58 ప్రకారంగా సంబంధిత ఆధారాలతో మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. అనంతరం టి.ఆర్. నగర్ తారకరామ ప్రకృతి వనాన్ని సందర్శించి పట్టణ వాసులు ప్రతి ఒక్కరూ వచ్చి పిల్లలతో వచ్చి వీక్షించాలని కోరిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చాంద్ పాషా, పట్టణ యూత్ అధ్యక్షుడు కత్రోజ్ గిరి, నాయకులు విఘ్నేష్, బాబా గౌడ్, సుమన్, ప్రశాంత్, మురళి తదితరులు ఉన్నారు.

## సీజనల్ నాయకునికి ఎమ్మెల్సీ కవితను విమర్శించే హక్కు లేదు

**ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**




**జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ.... మాజీ ఎంపీ మధుయాష్కీ కాలం కి ఒకసారి వచ్చే వ్యక్తి అని, నిరంతరం ప్రజల్లో ఉండే ఎమ్మెల్సీ కవిత ని విమర్శించే నైతిక హక్కు మధుయాష్కికి ఏ మాత్రం లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే నీళ్లు, నిధులు, నియామకాలు కోసమని, తాగు, సాగు నీటి కోసం ముఖ్యమంత్రి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. 5000 వేల కోట్ల తో మిషన్ కాకతీయ ద్వారా ప్రతి నీటిబొట్టుని ఒడిసి పట్టి సాగునీటిని అందించారని, నియోజకవర్గంలో సైతం నాలుగు కోట్లతో అనేక గ్రామాల్లో చెక్ డ్యాం లు నిర్మించామన్నారు. ప్రపంచమే అబ్బురపడేలా కాళేశ్వరం కట్టిన ఘనుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. రైతుల మోసం గడిచిన ఏడు సంవత్సరాల కాలంలో కేంద్రం ఒక్క గోదాం కట్టలేదన్నారు. సంవత్సర కాలంలో సీజన్ వారిగా కనపడే నాయకుడు మధుయాష్కీ అని, ఆయన ఏం అభివృద్ధి చేసాడో అందరికి తెలుసు అని అన్నారు. ఎమ్మెల్సీ కవిత ఎంపీగా ఉన్న సమయంలో పసుపు బోర్డ్ కోసం ఎక్కని మెట్టు లేదు, కలవని ముఖ్యమంత్రులు లేరని, ఈ విషయాన్ని మధుయాష్కీ తెలుసుకోవాలన్నారు. నిజామాబాద్ చెరుకు ఫ్యాక్టరీ కోసం మీరు ఎంపీగా ఉన్నపుడు ఏం చేశారని ప్రశ్నించారు. నిరంతరం ప్రజల్లో ఉండే ఎమ్మెల్సీ కవిత ను కాలం కి ఒకసారి వచ్చే మాధుయాష్ కి విమర్శించే హక్కు లేదని, వీలైతే రైతుల కోసం మీ మిత్రుడు రాహుల్ గాంధీతో మాట్లాడి రైతుల పక్షాన నిలవాలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, రాయికల్ పట్టణ పార్టీ అధ్యక్షులు గట్టు సతీష్, ఇంతియాజ్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ ముజహిధ్, పార్టీ మండల అధ్యక్షులు బాల ముకుందం, కోల శ్రీనివాస్, నారాపాక రమేష్, గుర్రాల రాజేందర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆనందరావు నాయకులు సురేష్ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే రాజయ్య మాతృమూర్తి మృతి

**జనగామ మార్చి 30 (ప్రజామంటలు):** మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాతృమూర్తి తాటికొండ లక్ష్మీ (87) కొద్దిసేపటి క్రితం మరణించారు. ఆమె మరణం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆమె ఆత్మ శాంతించాలని, ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు.

# జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం

- **పాత్రికేయులకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ**



**జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు):** జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని జగిత్యాల ప్రెస్ క్లబ్ 2021 అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి అన్నారు. జగిత్యాల పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్ లో గుప్తదాతలు అందించిన సహకారంతో ఉగాది పండుగను పురస్కరించుకొని 35 మంది పాత్రికేయులకు 25 కిలోల బియ్యం, ఆయిల్ ప్యాకెట్, చక్కెర, పప్పు, గోధుమపిండి ప్యాకెట్లను ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.... మా ప్రెస్ క్లబ్ ఎన్నికై 15 నెలలు కావస్తుందని గత సంవత్సరం కరోనా కష్ట కాలంలో 55 మంది పాత్రికేయులకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, వినాయక చవితి పండుగకు కొత్త బట్టలు నిత్యావసర వస్తువులు, ఈ ఉగాది పండుగకు మూడోసారి నిత్యావసర సరుకులు అందజేషామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకోసం జగిత్యాల రూరల్ మండలం గూట్రాజపల్లిలో సిగ్మా ఆసుపత్రి, స్థానిక గ్రామ పంచాయితీ సహకారంతో వైద్యశిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించి సామాజిక సేవ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులను ఆర్థికంగా ఆదుకునేందుకు "జర్నలిస్ట్ బంధు" పథకం అమలుచేయాలని కిషన్ రెడ్డి కోరారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను ప్రెస్ క్లబ్ పక్షాన కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువును పొడగించకుండా కొత్తవి వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. మా ప్రెస్ క్లబ్ చేస్తున్న కార్యక్రమాలకు సహకరిస్తున్న గుప్తదాతలకు ప్రెస్ క్లబ్ పక్షాన కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు తిరునగరి శ్రీనివాస్, గుర్రం చంద్ర శేఖర్, గుండేటి రాజు, ఎన్. జైపాల్, చింత రోజా, బోరగళ్ళ లావణ్య, సతీష్ కుమార్, ఆముద లింగా రెడ్డి, గాజుల శ్రీనివాస్, భూమి వేణు మాధవ్, దేవయ్య,అనంతుల కాంతారావు,శ్రావణ్ కుమార్, రేణికుంట శ్రీనివాస్, కల్లెడ నరేష్ కుమార్, మల్లేశం, సుధాకర్, ఆనందం, తిరుపతి, మహేశ్వర్, కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు దశాబ్దాల నారాయణుని ఆలయం



**జనగామ మార్చి 30 (ప్రజామంటలు):** జనగామ జిల్లా మున్సిపాలిటీ పరిధిలోని గ్రెయిన్ మార్కెట్ యార్డులో సరిగ్గా నలభై ఏళ్ల కింద శ్రీ దుందుభి నామ సంవత్సర ఉగాది పర్వదినాన ఓ శుభగడియలో, ఓ శుభముహూర్తాన, ఓ శుభ సంకల్పాన, అంకురార్పణ చేసుకున్నది నారాయణుని ఆలయం. తొలుత శ్రీ లక్ష్మీనారాయణ స్వామిని ప్రతిష్ఠించి చిన్న గుడిగా ప్రారంభించారు. నాటి నుండి దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందుతూ వస్తుంది. మార్కెట్ యార్డులోని వ్యాపారస్తులు, పట్టణంలోని ప్రముఖులందరి భాగస్వామ్యంతో బిందువు బిందువు సింధువైన చందాన నేడు మూలవిరాట్ శ్రీ లక్ష్మీనారాయణ స్వామితో పాటు అభయాంజనేయస్వామి, సాయిబాబా, శివలింగం, నవగ్రహాలు, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిల ఉపాలయాలతో దేదీప్యంగా విలసిల్లుతుంది. ఈ మహా భగవత్ కార్యంలో తమ జీవితాంతం వరకు తమ సమయాన్ని, ధనాన్ని వెచ్చించి స్వర్గస్తులైన మహానుభావులు: స్వర్గీయ బెజగం చంద్రయ్య, రామిని సుధాకర్, మాశెట్టి సుధాకర్, నాగబండి పుల్లయ్య, పజ్జూరి మురళయ్య, గుడాల భూమయ్య, గాదె చంద్రయ్య, సాధన సిద్దయ్య, వీరంతా ప్రాతః స్మరణీయులు. అనతికాలం లోనే వీరంతా జనగామ పట్టణంలోని వర్తక వ్యాపారుల ఐక్యతతో ఆలయానికి నిత్యధూపదీప నైవేద్యాల కోసం శాశ్వతంగా ఆదాయం కావాలనే సంకల్పంతో ఆలయం చుట్టూ పదమూడు షట్టర్లు, ఒక మినీ కళ్యాణ మండపాన్ని దాతల సహాయ సహకారాలతో నిర్మించారు. ఇలా పవిత్ర పూజలు అందుకుంటూ మహిమగల దేవాలయంగా విలసిల్లుతోంది ఈ ప్రాంతంలో ఉన్న వ్యాపారస్తులు, జనగామ ప్రజలు నిత్యం కొలిచే దేవాలయంలో ప్రతీ సంవత్సరం క్రమం తప్పకుండా ఉగాది ఉత్సవాలు,శ్రీరామనవమిన స్వామివారి కళ్యాణం, గోకులాష్టమి, హనుమాన్ జయంతి, వినాయకచవితి, బతుకమ్మ పండుగ, దసరా ఉత్సవాలు, దీపావళి పూజలు, కార్తీకమాసంలోసామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, సమయానుకూలంగా అన్నదానాలు, నిర్వహిస్తారు. ఈ నలభై వార్షికోత్సవ సందర్భంగా ఆలయంలో ధ్వజస్తంభం మరమత్తులు, రంగులు-సున్నాలు, కొత్తగా వాటర్ ట్యాంక్, పూర్తిగా సుందరీకరణ చేసుకుని ఉత్సవాలకు సిద్ధంగా తయారైంది. ఈ ఉగాది పర్వదినం సందర్భంగా కవి హృదయం సాహిత్య వేదిక అధ్వర్యంలో కవి సమ్మేళనం ఎర్పాటు చేస్తున్నారు అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగించనున్నారు. శ్రీరామనవమి వరకు ఆలయప్రాంగణంలో పలు విధములైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడానికి నిర్వాహకులు ప్రణాళిక బద్దంగా ముందుకు పోతున్నారు. భగవత్బంధువులైన మీరు మీ యొక్క ఆర్థిక, హార్దిక సహాయ సహకారాలు అందజేయగలరని శ్రీలక్ష్మి నారాయణ సహిత అభయాంజనేయ స్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, షిరిడీ సాయిబాబా ఆలయం, కార్యనిర్వాహకులు ఆకుల వేణుగోపాల్ రావు కోరారు.

## జనగామ జిల్లా కవులు, కళాకారులచే 'ఉగాది' ప్రత్యేక కార్యక్రమం

**రికార్డింగ్ నిర్వహించిన హెచ్.ఎం. టి.వి.**



**జనగామ మార్చి 30 (ప్రజామంటలు):** హెచ్ ఎం టి వి జోర్దార్ వార్తలు శీర్షికలో ఉగాది సంబరాలు ప్రత్యేక కార్యక్రమం జనగామ జిల్లా కేంద్రంలోని జూబ్లీ ఫంక్షన్ హాల్ జనగామలో బుధవారం శ్రీ సాయి మ్యూజిక్ స్టూడియో అధినేత చిలుమోజు సాయికిరణ్ నిర్వహణ సారథ్యంలో కళాకారుల సమ్మేళనం రికార్డింగ్ (షూటింగ్) చేశారు. కవులు, కవయిత్రిలు, కళాకారులు పాల్గొని ఉగాది, సామాజిక చైతన్యం కలిగించే అర్థవంతమైన పాటలు, కవితలు చదివి వినిపించారు. జోర్దార్ రామన్న తెలంగాణ యాస బాషలో చక్కని వ్యాఖ్యానం చేశారు. ఈ సందర్భంగా జోర్దార్ రామన్న మాట్లాడుతూ.... స్థానికంగా ఉన్న కళాకారులను ప్రోత్సాహం అందించడానికి హెచ్.ఎం.టి.వి ప్రజల పక్షనా నిలబడి కార్యక్రమాలు ప్రసారం చేస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో జనగామ జిల్లా కళాకారులకు అవకాశాలు కల్పించి ప్రతిభకు పట్టం కడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జి.వై. గిరి పౌండేషన్, చైర్మన్ జి.కృష్ణ, కవి హృదయం సాహిత్య వేదిక వ్యవస్థాపకులు పెట్లోజు సోమేశ్వరాచారి, అభినందన సోషల్ సర్వీసు సొసైటి, అధ్యక్షుడు అయిలా సోమనర్సింహచారి, సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ల నర్సయ్య, టిపా కళాకారులు లగిశెట్టి ప్రభాకర్, తొలుపునూరి రామచంద్రం, వుప్పల వసంత, బుదారపు లావణ్య, తాళ్లపల్లి శ్రీవాణి, బుదారపు వినోద్ కుమార్, రాగల్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఉగాది రోజు 2వ తారీఖు శనివారం రాత్రి 8.30 గంటలకు, మరుసటి రోజు 3వ తేదీ ఆదివారం ఉదయం 8.30 గంటలకు ప్రసారం అవుతుంది.

## మధ్య మానేరు కుడికాలువకు మరమ్మతులు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చాడ లేఖ



**చిగురుమామిడి మార్చి 30 (ప్రజామంటలు):** మండలం లోని రేకొండ మధ్యమానేరు కుడి వరద కాలువకు మరమ్మతులు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కు లేఖ రాసినట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు అందే స్వామి మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మారెడ్డి తెలిపారు. చిగురుమామిడి, రేకొండ మీదుగా బొమ్మనపల్లి వరకు అలాగే బొమ్మనపల్లి మత్తడి దామెర కుంట మత్తడి నీరు వరద కాలువలో పోయి బండారుపల్లి నుండి చిగురుమామిడికి వ్యవసాయ పొలాలకు సాగునీరు వెళుతున్నాయని ఈ మధ్య కాలంలో కాలువకు అక్కడక్కడ గండ్లు పడ్డాయని దానిమూలంగా సాగు నీరు వృధాగా పోతున్నాయని పంట పొలాలు నీట మునిగి రైతులు నష్టపోతున్నారని, బావుల్లో నీరు నిలిచిపోవడంతో బావులు కూలిపోతున్నాయని లేఖలో పేర్కొన్నారు. వరద కాలువ చీఫ్ ఇంజనీర్ ఇచ్చిన అంచనాలు ప్రభుత్వ శాఖలో పెండింగ్ లో ఉన్నదని తక్షణమే మధ్య మానేరు కుడి కాలువకు (కెనాల్-8)మరమ్మతులు చేపట్టుటకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ను చాడ వెంకటరెడ్డి కోరారని స్వామి, లక్ష్మారెడ్డి తెలిపారు.

## ఆరకాల పల్లెలో ఘనంగా పోచమ్మ బోనాలు



**చిగురుమామిడి మార్చి 30 ( ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఆరకాల పల్లె లో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండి పాడి పంటలతో ఆయురారోగ్యాలతో ఉండాలని మహిళలు పోచమ్మ తల్లికి మొక్కులు బోనాలు నైవేద్యం సమర్పించుకున్నారు. డప్పు చప్పుళ్ళ మధ్య బైండ్ల వారి ఆటపాటలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సీనియర్ జర్నలిస్ట్ గాదె రఘునాథ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొమ్మెర మంజుల రెడ్డి, రెడ్డి సంఘం నాయకులు గునుకుల గణపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బజార్ రాజిరెడ్డి, చిట్యాల బాల్రెడ్డి, అరకల రాజిరెడ్డి, కేతిరెడ్డి మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గునుకుల శ్రీకాంత్ రెడ్డి, రాజు, హరికృష్ణ, బరిగెల మోహన్, రాజు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి చేతుల మీదుగా అవార్డ్ స్వీకరించిన కమీషనర్ స్వరూప రాణి




**జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు):** గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన ప్రాజెక్ట్ డైరెక్టర్ అండ్ మున్సిపల్ కమిషనర్ జి. స్వరూప రాణి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తముగా 2020-21 సంవత్సరంనకు జగిత్యాల స్త్రీనిధి లోన్స్ సంక్షన్ రిపేమెంట్ లక్ష్యాలను 100% పూర్తి చేసినందుకు మొదటి బహుమతి మరియు మంచిర్యాల మున్సిపాలిటీలో స్పెషల్ అచివ్ మెంట్ ఆన్ హైయెస్ట్ డిస్బర్స్మెంట్ విత్ 100% ఆచివ్మెంట్ బహుమతిని స్త్రీ నిధి 9వ సర్వ సభ్య సమావేశము యందు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గారి చేతుల మీదుగా రెండు అవార్డులను స్వీకరించిన ప్రాజెక్ట్ డైరెక్టర్ మరియు మున్సిపల్ కమిషనర్ జి. స్వరూప రాణి. ఇట్టి కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయ, మున్సిపల్ అండ్ మెప్మా డైరెక్టర్ సత్యనారాయణ, స్త్రీ నిధి బ్యాంక్ యం.డి విద్యాసాగర్ రెడ్డి మరియు స్త్రీనిధి అధ్యక్ష కార్యదర్శులు ఇందిరా, సరస్వతి పాల్గొన్నారు.ద

## స్పృహ తప్పిన నెమలి

**ప్రాణం కాపాడిన సర్పంచ్, గ్రామస్తులు**



**కథలాపూర్ మార్చి 30 (ప్రజామంటలు):** ఎండ దెబ్బకు చావు బతుకుల మధ్య ఉన్న జాతీయపక్షి నెమలికి ప్రాణం పోసి సురక్షిత ప్రాంతానికి తరలించిన గ్రామ సర్పంచ్, గ్రామస్థులకు ప్రశంసలు లభించాయి. మండలంలోని తాండ్రియాల గ్రామంలో చోటుచేసుకున్నది ఈ సంఘటన. వివరాల్లోకి వెళితే.... బుధవారం ఉదయం బైకని మధు అనే యువకుడు తన పొలానికి వెళ్లగా ఒక నెమలి కనిపించింది. అది ఎంతకూ కదలక పోయేసరికి దగ్గరికి వెళ్లి పరిశీలించి వెంటనే గ్రామ సర్పంచ్ గడీల గంగ ప్రసాద్ కు సమాచారం ఇవ్వగా ఆ నెమలి స్పృహ తప్పి పడిపోయిందని గమనించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, పశు వైద్యులకు సమాచారం ఇవ్వగా గ్రామంలోకి తీసుకొచ్చి వైద్యం అందించారు. అనంతరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మధు కు నెమలిని అప్పగించారు. జాతీయ పక్షి నెమలికి ప్రాణం పోసిన గ్రామ సర్పంచ్, గ్రామస్థులపై పలువురు ప్రశంశలు కురిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడిలా గంగా ప్రసాద్, గండ్ర గంగరావు, బాల్క సంజీవ్, పాలేపు రాజేష్, ఏనుగు జలందర్, మంచాల మహేష్, బైకేని మధు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మధు, వైద్యులు శ్రీనివాస్ లు ఉన్నారు.

## ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ వితరణ




**జనగామ మార్చి 30 (ప్రజామంటలు):** లయన్స్ క్లబ్ జనగామ డైమండ్స్ వారు జడ్. పి. హెచ్.ఎస్. కడవెండి స్కూల్ 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు లయన్ గట్టు శ్రీనివాస్, క్లబ్ సభ్యులు గొడిశాల శివరామకృష్ణ, లయన్ కందుకూరి నాగరాజు, గ్రామస్తులు ఆసనాల మల్లోజి, బూడిద శ్రీనివాసు, పెద్ది రామ్ చందర్, దొంటిక అశోక్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జనగామ మండలం లో దగాపడ్డ దళిత బంద్



**జనగామ మార్చి 30 (ప్రజామంటలు):** జనగామ మండలంలో 17 గ్రామాలు ఉంటే కేవలం ఆరు గ్రామాలకే దళిత బంధు పరిమితమైపోయిందని బిజెపి ఎస్.సి. దళిత మోర్చా జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి పొనగంటి చిరంజీవి ఒక ఒక ప్రకటనలో ఆరోపించారు. అది కూడా టిఆర్ఎస్ కార్యకర్తలకే ఇవ్వడం జరిగిందని, కేవలం ఒక పెంబర్తి గ్రామంలో ముగ్గురి పేర్లు తీసుకున్నారని అన్నారు. దళిత బంధు అంటే టిఆర్ఎస్ కార్యకర్తల బందు కాదు గ్రామ గ్రామాన గ్రామ సభ పెట్టి పేద దళితులను గుర్తించి తీర్మానం చేయ్యకుండా టి.ఆర్.ఎస్. బడా లీడర్లు వాళ్ల వెంట తిరిగే కార్యకర్తల పేర్లు రాసుకోవడం దారుణమని అన్నారు. ఎస్సీ ఎస్టీ మైనారిటీ రుణమాఫీ గ్రామాల్లో ఎంపిక చేసినట్లుగా దళిత బంధు పథకం ఎంపిక చేయకుండా నిర్ణయించడం సరైన చర్య కాదని, అర్హులైన దళితులకు అన్యాయం జరిగితే ఊరుకోమని ఆయన ప్రకటనలో హెచ్చరించారు.




లయన్స్ క్లబ్ జనగామ డైమండ్స్ జెడ్పిహెచ్ఎస్ కామారెడ్డి గూడెం స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు అల్ ఇన్ పుస్తకాలు, ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. పాల్గొన్న అధ్యక్షుల లయన్ గట్టు శ్రీనివాస్, క్లబ్ సభ్యులు దారం సత్యనారాయణ సతీమణి స్వరూపరాణి, గొడిశాల శివరామకృష్ణ, కందుకూరి నాగరాజు, అశోక్.

# టిడిపిలో ఎన్టీఆర్‌కు వెన్నుపోటును మరచిపోగలమా !

తెలుగు ప్రజల ఆత్మగౌరవం నినాదంతో ప్రాంతీయ పార్టీని పెట్టిన ఎన్టీఆర్ అదే పార్టీలో తన సొంత అల్లుడు చంద్రబాబు చేతిలోనే ఘోర పరాభవానికి గురయ్యారు. పార్టీ పెట్టి 40 ఏళ్ల సంబరాలు జరుపుకుంటున్న వేళ ప్రధానంగా ఎన్టీర్ పదవీచ్యుతి గురించి చర్చించాలి. ఎన్టీఆర్‌ను గద్దెదించి అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు నాటి చీకటి రోజుల గురించి చర్చించాలి. లక్ష్మీపార్వతిని అడ్డం పెట్టుకుని ..ఆమెను బూచిగా చూపి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచారు. నేటికీ ఈ ఘటనపై ఏనాడు కూడా చంద్రబాబు కానీ, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు కానీ క్షమాపణలు కోరలేదు. తెలుగుదేశం పార్టీని, సిఎం పదవిని వెన్నుపోటుతో లాక్కున్న చంద్రబాబు ఏనాటికీ క్షంతవ్యుడు కాదు. ఎన్టీఆర్ పదవీచ్యుతుడు కాకుండా ఉండివుంటే ఆయన ప్రధాని పదవిని అధిష్టించేవారు. ఇకపోతే ఎన్టీఆర్ బొమ్మకు దండలు వేయడం మాత్రం చంద్రబాబు బాగా అలవాటు చేసుకున్నారు. రెండెకరాల ఆసామి అయిన చంద్రాబాబు రాజకీయాల్లో వేలకోట్లు ఎలా సంపాదిం చాడో చర్చించాలి. కాంగ్రెస్ హయాంలో ఇందిరా ప్రధానిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పార్టీని ఎన్టీఆర్ స్థాపిస్తే ఇవాళ అదే కాంగ్రెస్‌తో చంద్రబాబు తన రాజకీయ ప్రాపకం కోసం జట్టుకట్టాడు. తెలుగువారి ఆత్మగౌరవం ఢిల్లీ పెద్దల పాదాల కింద పడి నలుగుతున్న రోజుల్లో... మాటిమాటికి ముఖ్య మంత్రులను మారుస్తూ, వారిని అవహేళన చేస్తూ, కీలుబొమ్మలుగా ఆడిస్తున్న రోజుల్లో... తెలుగు వారంటే మద్రాసీలుగా పరిగణిస్తున్న రోజుల్లో.. తెలుగువారి ఆత్మగౌరవ నినాదం ఎత్తుకున్న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారు. కాంగ్రెస్ పాలనపై ఎన్టీఆర్ దండయాత్రచేశారు. పార్టీ పెట్టిన 9 నెలల్లో పార్టీని అధికారం లోకి తీసుకుని వచ్చి సంచలనం సృష్టించారు. తెలుగు ప్రజల పౌరుష ప్రతాపాలకు పదును పెట్టగల కార్యశూరుడి ఎన్టీఆర్ ఆవిర్భవించారు. అద్భుతమైన పాలన అందించారు. కానీ నమ్మి నెత్తిన పెట్టుకున్న సొంత అల్లుడు చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు కలసి వెన్నుపోటు పొడిచారు. నాటి గవర్నర్ కృష్ణకాంత్‌ను అడ్డంపెట్టుకుని అధికారాన్ని చంద్రబాబు చెర పట్టారు. ఈ క్రమంలో చంద్రబాబు క్యారెక్టర్‌పై టిడిపి కార్యకర్తలు చర్చించాలి. ఓట్లేసి గెలిపించిన నేతను పదవీచ్యుతుడిని చేశారు. సొంత మామ అన్న కనీస గౌరవం లేకుండా పదవికోసం అక్రమ రాజకీయాలకు, వెన్నుపోటు రాజకీయాలకు చంద్రబాబు పాల్పడిన తీరుపై తెలుగుజాతి మండిపడుతోంది. చంద్రబాబు ఆ తరవాత ఎప్పుడూ సొంతంగా ఏనాడూ గెలవలేదు. వాజ్‌పేయ్ హవాలో,మోడీ హవాలో మాత్రమే గెలిచిన సందర్భం గమనించాలి. 40 ఏళ్ల సంబరాల గురించి చర్చించుకుంటున్న వేళ చంద్రబాబు దురాగతాలపైనా చర్చించాలి. ఎన్టీఆర్ సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తే దానికి తూట్లు పొడిచే మద్యానికి బార్లాగా గేట్లు తెరిచారు. ఇవాళ మద్యపాన నిషేధం గురించి జగన్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న టిడిపి లేదా చంద్రబాబు.. ఆనాడు ఉమ్మడి ఎపిలో మద్యపాన నిషేధాన్ని ఎందుకు ఎత్తి వేశారో చెప్పాలి. ప్రజలు దీనిని నిలదీయాలి. నిజానికి ఓ సమున్నత లక్ష్యంతో ఎన్టీఆర్ మద్యపాన నిషేధాన్ని తీసుకుని వచ్చారు. ఎన్టీఆర్ నుంచి అధికారన్ని లాక్కున్న చంద్రబాబు అలా ఎన్టీఆర్ పథకాలకు తూట్లు పొడిచారు. కిలో రెండు రూపాయల బియ్యాన్ని ఐదు రూపాయలకు పెంచారు. జనతా వస్త్రాలను పక్కన పెట్టారు. పేదలను విస్మరించి పెద్దలతో జతకట్టారు. ఇన్ని రకాలుగా టిడిపిని భ్రష్టు పట్టించిన చంద్రబాబు ఇవాళ ఎన్టీఆర్‌ను తలచుకుంటూ.. ఆయనకు నివాళి అర్పించినంద మాత్రాన పాపాలు కడిగేసుకున్నట్లు కాదు. 1982 మార్చి 28న ఎన్టీఆర్ పార్టీ ప్రకటించిన సందర్భం ఓ ఉద్విగ్నమైనది. ఆరోజు హైదరాబాద్, సాయకాలం పూట న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్..



ఎన్టీఆర్ అభిమానులతో ఆ ప్రాంగణం సందడిగా ఉంది. తెలుగువారి తెరవేలుపు నందమూరి తారకరామారావు పార్టీ ప్రకటన చేస్తారని తెలియడంతో యువత కూడా పెద్ద ఎత్తున వచ్చింది. ప్రాంగణం జనంతో నిండిపోయింది. అప్పుడే ఎన్టీఆర్ రావడంతో కోలాహలం మొదలయ్యింది.. రాజకీయ ప్రవేశం గురించి చెప్పిన ఎన్టీఆర్ పార్టీ పేరు కూడా అక్కడే ప్రకటించారు. ఓ అరగంట పాటు ప్రసంగించారు. పార్టీ పేరు తెలుగుదేశం అని అనగానే కేరింతలు, చప్పట్లతో ఆ ప్రాంగణం మారుమోగింది. అలా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. ప్రాంతీయపార్టీల చరిత్రలోనే ఓ కొత్త శకానికి నాంది పలికింది. ఆనాడు పార్టీ ప్రకటించిన సందర్భంలో ఈనాటి చంద్రబాబు లేడు. ఆయన కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా ఉన్నాడు. ఎన్టీఆర్ పై పోటీచేసి ఓడిస్తానని ప్రకటించాడు. అలా ప్రకటించి ఎన్నికల్లో ఓడిపోయాడు. తరవాత అల్లుడు అన్న ట్యాగ్‌తో పార్టీలో చేరి ఎన్టీఆర్‌నే మింగిన ఘనుడు చంద్రబాబు. దీనిని చరిత్ర కాదనలేని సత్యం. అలా పార్టీని ప్రకటించిన ఎన్టీఆర్ చైతన్య రథం సిద్దం చేసుకుని.. కుమారుడు హరికృష్ణ సారథిగా ముందుకి కదిలారు. చైతన్యరథమే ప్రచార వేదికగా ప్రచార రంగంలోకి దుమికారు. తెలుగుదేశం పిలుస్తోంది..రా..కదలిరా అనే నినాదం ఊరూరా మార్మోగింది. చైతన్య రథంపై నుంచే ప్రజలను ఉత్తేజితులను చేస్తూ..ఉద్వేగపూరితమైన ఉపన్యాసాలిస్తూ ముందుకు సాగారు. ఎండావానలను లెక్క చేయకుండా,వణికిస్తోన్న చలిని పట్టించుకోకుం డా రాత్రింబవళ్లు ఆరుపదుల వయసు లో అలుపెరగకుండా ప్రజల్లో తిరిగారు. ఖాకీ దుస్తులు ధరించి ఓ కార్మికుడిలా కృషి చేశాడు. ప్రజల అభిమానానికి దాసోహమంటూ అడుగడుగునా ఆయనకు జననీరాజ నాలు పలికారు. రాష్ట్రచరిత్రలో అలాంటి చైతన్య యాత్ర మరొకటి లేదనిపిస్తుంది. దశాబ్దాల చరిత్ర ఉన్న జాతీయ కాంగ్రెస్ పార్టీని.. కొన్ని నెలల వయసున్న పసికందు లాంటి పార్టీ చిత్తు చేసి ఓడించడం చరిత్ర లోనే అపూర్వం.

ఆ ఘనత ఎన్టీఆర్‌కే దక్కింది. ఎన్టీఆర్ ప్రచార ప్రభంజనం కాంగ్రెస్ అధికార మదాన్ని మట్టికరిపించింది. కేవలం తొమ్మిదినెలల క్రితం అంకురార్పణ జరిగిన పార్టీ అధికారపార్టీ అంచనాలకి అందని రీతిలో అపూర్వ విజయం సాధించింది. 1983 జనవరి 7న మధ్యాహ్నం ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. తెలుగుదేశం 199 సీట్లు సాధించింది. కాంగ్రెసుకి కేవలం అరవై మాత్రమే దక్కాయి. ఈ విజయం రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లోనే ఓ అద్భుత విజయం. పోటీ చేసింది ఎవరైనా ఎన్టీఆర్ బొమ్మ పెట్టుకుంటే చాలు విజయం వరించింది. తెలుగుదేశం జెండా రాష్ట్రం నలుమూలలా సగర్వంగా రెపరెపలాడింది. అలా కాంగ్రెస్‌లో ఓటమిపాలైన చంద్రబాబు అధికారంలో ఉన్న ఎన్టీఆర్ పంచన చేరి.. మామకే వెన్నుపోటు పొడిచన తీరు తెలుగుజాతి ఏనాడు మరచిపోదు. 40 ఏళ్ల పార్టీ ఆవిర్భావం గురించి చర్చించే వేళ చంద్రబాబు కుట్ర రాజకీయాలు, వెన్నుపోట్లపైనా ప్రజలు చర్చించాలి. ఇది ఓ చరిత్ర..దీనిని ప్రజలు ఎప్పటికీ మరవరు.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్.

# దుంధుభి

రాత్రి టీ.వీ.లో వార్తలు వింటూ ప్రకాశం కుటుంబ సభ్యులు భోజనం చేస్తున్నారు. ప్రకాశం తన కూతురు రమ్య, కొడుకు ప్రవీణ్, భార్య శారదతో కబుర్లు చెప్పుకుంటూ, మధ్యమధ్యలో తండ్రి విశ్వమూర్తితో మాట కలుపుతున్నాడు. విశ్వమూర్తి ఏడున్నరకే రాత్రి ఫలహారం చేసి పడక్కుర్చీలో కూర్చుని టీ.వి. చూస్తూన్నారు. వార్తల మధ్యలో ఐ.ఐ.టి. ఫలితాలు ప్రకటించిన కేంద్రవిద్యాశాఖ మంత్రి సి.డీ. ఆవిష్కరించారు. ఫలితాల కోసం వెబ్ సైటు చూసుకోవచ్చునని చెబుతున్నారు. ఈ ఐ.ఐ.టి. వ్రాసిన



ప్రవీణ్ కేసి తండ్రి చూసావా అని అడిగాడు. చూసాను, సెలక్టయ్యాను. నా రాంక్ 173 అని సమాధానం ఇచ్చాడు. మొహంలో ఏ భావము లేదు. జవాబు చెప్పే విధానం కూడా నిర్లిప్తత కూడి వుంది. ఇంత మంచి విషయం అడిగితే గానీ చెప్పవా, ఏం నీకు చదవటం ఇష్టం లేదా అని తండ్రి కొడుకుని అడుగుతున్నాడు. ఈ మాటలు విశ్వమూర్తి వింటూ మౌనంగా టీ.వి. వైపు దృష్టి పెట్టాడు.

అతనికి తన మెట్రిక్యులేషన్ చదివే రోజులు గుర్తుకొచ్చాయి. తన రూమ్ లోకి వెళ్ళి గతం తలుచుకుంటూ వర్తమానం బేరీజు వేసుకుంటున్నాడు. తన చిన్నప్పటి నుంచి బామ్మ భ్రమరాంబకి మనుమడు విశ్వమూర్తి అంటే వల్లమాలిన అభిమానం. దానికి కారణం ఆమె భర్త పేరు విశ్వమూర్తికి కలపడమే. విశ్వనాధానికి ముందు భాగము, వియ్యంకుడి పేరు రామమూర్తిలో చివరి భాగము కలిపి విశ్వమూర్తి అని పెట్టేడు కొడుకు తన మనుమడికి. ఆవిడకి చాధస్తం పాలు ఎక్కువ. భోజనం చేసేటప్పుడు తూర్పుకేసి కూచోమనేది. మందులు వేసుకుంటే ఉత్తరంగా తిరిగి వేసుకుంటే త్వరగా ఆరోగ్యం చేకూరుతుందనేది. తన మెట్రిక్ మొదటిసారి పరీక్ష పోయినప్పుడు, తను ఊరిలో లేకపోవటం వలన శకునం సరిగా చూసుకోకపోవటమే పరీక్ష తప్పటానికి కారణమనేది. నీ మనుమడు సరిగా చదివి, పరీక్ష తగలెడితే పాసవుతాడు. అంతే గాని శకునం బాగాలేదని వీడు చదివినంతా ఏ మాయావి ఎత్తుకుపోదు అని నాన్న బామ్మమీద ఎగిరేవాడు. ఆవిడ నమ్మకమో, నా అదృష్టమో తెలీదు గాని మూడవసారి నీళ్ళకుండ ఎత్తుకుని ఓ ముత్తైదువ ఎదురొచ్చింది. ఆ సంవత్సరం పరీక్ష గట్టెక్కింది. పేపరులో నంబరు చూడగానే మా బామ్మ నాలుగు కేజీల మినపసున్ని చేయించి ఆ వీధంతా పంచి పెట్టింది. అడిగినవారికి, అడగనివారికి ఈ రెండు వర్గాలవారికే మనుమడు పరీక్ష పాసయ్యాడని చెప్పుకొచ్చింది. దూరంగా ఉన్నవాళ్ళకి కార్డు వ్రాయించింది. నా చేత వ్రాయించి, ఆవిడ సంతకం పెట్టి పోస్టు డబ్బాలో వేసుకుంది. ఈ సంబరాలు, పి.యూ.సీ.లో చేరేవరకు జరిపించింది.

పక్కవూరికి చదువుకోసం నడచి వెళ్ళలేనని, నాన్న సైకిల్ కొన్నాడు. ఆరు కిలోమీటర్లు దూరంలో వుంది కాలేజి. కొనగానే సైకిలు మూడు రోజులువరకు వాడనివ్వలేదు. నాలుగవ రోజు గుడికి తీసుకెళ్ళి పూజారిగారిచేత నిమ్మకాయలు కట్టించి, పూజచేసి, కొబ్బరికాయ తిప్పి, గాలి కుడి పక్కగా వచ్చేదాకా ఎదురు చూసి, బడి మూసే సమయం కావటంతో పిల్లలు పుస్తకాలతో నాకు ఎదురుగా వచ్చినప్పుడు సైకిల్ తొక్కటానికి పచ్చ జండా వూపింది. ఘన విజయం సాధించిన సామ్రాజ్యాధికారిలా నేను ఆ వాహనంపై ఊరంతా తిరిగి వచ్చాను. సైకిల్ తొక్కటం ముందే నేర్చుకున్నాను. ఇఉటికి పాలు తెచ్చే వీరయ్యని, చాకలి రంగడిని వారి సైకిల్ ఇవ్వమని బ్రతిమాలి ఎక్కి తొక్కి నేర్చుకున్నాను. అలాగే చదువు, పరీక్షలవు జరుగుతూ వుండేవి.

రోజూ బామ్మ ఐదు గిన్నెల క్యారేజి సైకిలికి కట్టించి మరీ పంపేది కాలేజీకి. నిత్యం అరుగుమీద కూర్చున్న ఆవిడ పిలిచినప్పుడు బయటికి వచ్చి బయలుదేరవలసినదే. ఎపుడైనా కంగారు పడి బయలుదేరిపోతే ఓ కిలోమీటరు వెళ్ళాకైనా సరే, వెనక్కి రమ్మనమని వెనకాలే ఎవరినో పంపించేది. కాదని వెళ్ళి ఒకటి రెండు సార్లు చిన్న చిన్న దెబ్బలు తగిలించుకుని ఇంటికి వచ్చి ఆవిడకి దొరికిపోయిన సందర్భాలు వుండేవి. పరీక్షరోజు యుద్దానికి వెళ్ళే సేనాధిపతిలా చూసేది బామ్మ నన్ను. ఉదయమే గుడికి వెళ్ళి, కుంకుమ పెట్టుకుని, ఆ బొట్టు పరీక్షకి పట్టుకెళ్ళే అట్టకి కాస్త, పెన్నుకి కాస్త పెట్టి, హాలుటికెట్టు దానికి పెట్టి దేవుడి గూట్లో రెడీగా వుంచాలి. ఇవన్నీ చూస్తూ నాన్న పళ్ళు కొరుకున్నేవారు. అమ్మ మౌనంగా నవ్వుకునేది.

ఆవిడ బయటి నుంచి కేక పెట్టాక అమ్మ గబగబా కాసిని ఆవాలు నా తలచుట్టూ 5 సార్లు తిప్పి పారేయాలి. కాస్త పెరుగు బిళ్ళ నా నోట్లో పొయ్యాలి. ఓ తులసాకు చేతిలో పెట్టాలి. ఇవి అమ్మకి బామ్మ జారీచేసిన హుకుం. నేను పరీక్ష పాసవ్వటానికి వెనుక బామ్మ నమ్మకాలే బలంగా వున్నాయో లేక నా ప్రతిభ్నా నం ఉన్నాయో ఈ రోజుకీ నాకు తెలీదు. కానీ చదువు, ఉద్యోగం అన్నీ ఆమె చెప్పినట్లే చేసాను. సంపాదించాను. బాగానే ఉన్నాను. నాకు ఇంకా గుర్తు పీ.యూ.సి అవగానే కోపరేటివ్ బ్యాంకు వారి ప్రకటన చూసి ఇంటర్వ్యూకి వెళ్ళవలసి వచ్చింది. ఆ రోజు మంగళవారము. ప్రభుత్వ పనులకు, సంభాషణలకు గురువారం మంచిది. దేవుడి దయవలన గురువారానికి వాయిదా వేయమని త్రినాధస్వామికి మొక్కుకుంది బామ్మ. సాయంత్రానికి ఇంటర్వ్యూ వాయిదాపడినట్లు బ్యాంకు ముందు నోటీసు బోర్డులో పెట్టారు. శభాష్ బామ్మ అనుకున్నాను. వెళ్ళేముందు 8 సెనగలు ఎర్రగుడ్డలో చుట్టి నా జేబులో పెట్టింది. వారడిగినవి తెలీకపోతే ధైర్యంగా తెలీదని చెప్పు. వెర్రిమొహం వేయకు అంది. తింగరి వేషాలు వేయక చక్కగా ముందు అందరికీ నమస్కారం చెప్పు, వినయంగా నిలుచో, కూర్చోమంటే కూర్చో. తొందరపడి ధడేల్ మని కూచుండిపోకు అని చెప్పింది. లోకం చదివిన బామ్మ నా ఉద్యోగం వచ్చిన విషయం వినగానే ఎంతో సంబరపడిపోయింది. మళ్ళీ సంతోష సంబరాలు. ఇలా ప్రతీదీ అందరితో పంచుకునే బామ్మ పెంపకంలో నేను బాగానే జీవించాను. అవి పల్లె బంధాలు, బాంధవ్యాలు సామాజికంగా ముడిపడి వుండేవి. ఆమె అలవాట్లు నేను గౌరవిస్తూ వచ్చాను. బామ్మ తన ఆఖరి ప్రయాణం కూడా ఏకాదశి మరణం, ద్వాదశి దహనం కావాలని కోరుకుంది. అలాగే జరిగింది ఆవిడ అదృష్టం కొద్దీ. అంత శకున శాస్త్రం ఆమెకు సహకరించింది. ఆమె అనంతరం కూడా మాకు ఆమె అలవాట్లు, అభిరుచులు మాతోనే పయనిస్తున్నాయి నేటివరకూ.

ఈ రోజు ఇంత మంచి విజయం నాతోనే కాదు, ఎవ్వరితోనూ చెప్పకుండా మనుమడు ప్రవీణ్ ఎంత సాధారణంగా తీసుకున్నాడు. అంతరాల దూరం. ఇవి పట్నవాస ధోరణులు. మంచి, చెడు, సుఖము, దుఖము అన్నీ వంటరిగానే. అన్నివిషయాలకు దూరం. ప్చ్. ఏమిటో... అనుకుంటూ నిద్రలోని జారుకున్నాడు విశ్వమూర్తి. తెల్లవారింది. ఎవరి పనులపై వారు పరుగులతో పందెం వేసుకుంటూ...విష్ణుమూర్తి చేతిలో పేపరుతో ప్రపంచాన్ని చదువుకుంటూ....ఒంటరిగా కుర్చీలో%గా..

విశ్వశ్రీ, సాహిత్యశ్రీ డా. దేవులపల్లి పద్మజ
విశాఖపట్టణము, 9849692414

# విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన న్యూటన్

## మార్చి 31... సైన్స్ పితామహుడు సర్ ఐజాక్ న్యూటన్ వర్ధంతి

అధునిక సైన్సును కొత్త పుంతలు తొక్కించిన మహనీయుడు న్యూటన్. గణిత శాస్త్రంలోనూ అంతటి ప్రతిభాశాలి, అంతటి ప్రభావశీలి మరొకరు లేరు. ఆయన కాలంలో ఆయననూ ఆయనలాంటి వారినీ ప్రకృతి తాత్వికులుగా పిలిచేవారు. మానవ ప్రపంచానికి విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన "సర్ ఐజాక్ న్యూటన్" ఒక ఆంగ్ల భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త. ఈయన ఓ సిద్ధాంత కర్త మరియు తత్వవేత్త కూడా. ప్రకృతిసిద్ధమైన తత్వశాస్త్రం సైన్సుగా ఎలా పరిణామం చెందిందన్న అంశంపై చేసిన ఎనలేని కృషికిగానూ ఆధునిక ప్రపంచం అంతా ఆయనను "సైన్సు పితామహుడు"గా కీర్తించింది.

ప్రపంచంలోనే మేటి శాస్త్రవేత్తల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. ఈ రోజు అంతరిక్షంలోకి రాకెట్లలో రివ్వున దూసుకెళ్తున్నామంటే, అందుకే న్యూటన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే కారణం. విశ్వ రహస్యాలను మానవాళికి విశ్లేషించి చెప్పిన న్యూటన్ జనవరి 4, 1643వ సంవత్సరంలో ఇంగ్లండ్‌కు దగ్గర్లోగల ఉల్‌తోప్ అనే గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు.

న్యూటన్ చిన్నప్పుడు స్కూల్లో చదువుకంటే ఇతర సైన్సు పుస్తకాలు చదవటం, పెద్ద వస్తువుల్ని చూసి వాటినే చిన్న సైజులో తయారు చేయటం లాంటి పనులు చేస్తుండేవాడు. అలా చిన్న చిన్న మిషన్లు, నీటి గడియారం, ఎండలో పనిచేసే గడియారంలాంటివి కూడా ఆయన తయారు చేశాడు. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న ఈ వస్తువులన్నీ ఇప్పటికీ లండన్ రాయల్ సొసైటీ మ్యూజియంలో ఉన్నాయి.

1661 లో ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో చేరిన న్యూటన్.. గణిత, భౌతిక, ఖగోళ శాస్త్ర పరిశోధనలపై మక్కువ పెంచుకున్నాడు. ఆ తరువాత అక్కడే ప్రొఫెసర్‌గా నియమితుడైన న్యూటన్, 1667లో పరావర్తన దూరదర్శినిని నిర్మించి సంచలనం సృష్టించాడు. చిన్నతనంలో చెట్టు నుంచి రాలిన యాపిల్‌ను గమనించిన న్యూటన్ అందుకు కారణాన్ని అన్వేషించే క్రమంలో గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. భూమి, చంద్రుడు, గ్రహాలు, సూర్యుడు సహా విశ్వంలోని వస్తువులపై గురుత్వ శక్తి ఎలా పని చేస్తుందో వివరిస్తూ విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదిస్తూ, గమన సూత్రాలను నిర్వచించాడు.

గురుత్వాకర్షణ శక్తి గురించి, న్యూటన్ ప్రతిపాదించిన మూడు గమన నియమాల గురించి ప్రస్తావించాడు. తరువాతి మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఈ గ్రంథమే పునాది. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించాడు. దీనికి



ఆధారంగా కెప్లర్ నియమాలకూ మరియు గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపాడు. దీంతో సూర్య కేంద్రక సిద్ధాంతంపై పూర్తిగా అనుమానం తొలగిపోవడమే కాకుండా ఆధునిక సైన్సు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. విజ్ఞాన శాస్త్ర రంగం మీదకు ఐన్ స్టయిన్ వచ్చేదాకా మూడు దశాబ్దాల పాటు శాస్త్ర సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలినవాడు ఐసాక్ న్యూటన్. ఇప్పటికీ ఆయన చలన సూత్రాలు కొన్ని పరిమితులకు లోబడి సజావుగా పనిచేస్తోనే ఉన్నాయి

మొదటి సూత్రము
"బాహ్యబల ప్రయోగము లేనంత వరకు చలన స్థితిలో ఉన్న వస్తువు చలన స్థితిలోను, నిశ్చల స్థితిలో ఉన్న వస్తువు నిశ్చల స్థితిలోనూ ఉంటుంది". ఈ వస్తు ధర్మాన్ని జడత్వము అంటారు.

రెండవ సూత్రము
"ఒక వస్తువు ద్రవ్యవేగంలోని మార్పు ఆ వస్తువు పై ప్రయోగించిన బలానికి అనుపాతముగా ఉంటుంది. మరియు ఆ బలం ప్రయోగించిన దిశలో ఉంటుంది

న్యూటన్ మూడవ నియమం :
చర్యకు ప్రతి చర్య సమనంగా ఉండి వ్యతిరేక దిశలో పనిచేయును.భౌతిక శాస్త్ర భావనలను వివరిస్తూ "ప్రిన్సిపియా మేథమేటికా" అనే గ్రంథాన్ని రచించాడు. కాంతిపై న్యూటన్ చేసిన పరిశోధనల ఫలితంగా "దృశాశాస్త్రం" పుట్టింది.

మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ

ఈ గ్రంథమే పునాది. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించాడు. దీనికి

ఆధారంగా కెప్లర్ నియమాలకూ, గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపాడు.

ఆయనకు 1672లో రాయల్ సొసైటీ ఫెలోషిప్ లభించింది. అప్పటి వరకూ ప్రకృతి శాస్త్రంలో ఒక భాగంగా ఉన్న భౌతిక శాస్త్రాన్ని న్యూటన్ ఆవిష్కరణలు, సిద్ధాంతాల వల్ల ప్రత్యేక శాస్త్రంగా గుర్తించారు. అందుకే న్యూటన్‌ను భౌతిక శాస్త్ర పితామహుడు అంటారు. 1705లో బ్రిటిష్ ప్రభుత్వం "సర్" అని బిరుదునిచ్చి సత్కరించింది. ఇక అప్పటినుంచి ఐజాక్ న్యూటన్ కాస్తా సర్ ఐజాక్ న్యూటన్‌గా మారిపోయారు. ఆ తరువాత కూడా ఎన్నో మైలురాళ్లను అధిగమించిన న్యూటన్ తన 85 సంవత్సరాల వయస్సులో మార్చి 31, 1727న మరణించారు.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# సత్ఫలితాలు ఇస్తున్న సీసీకెమెరాల ఏర్పాటు

## సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సాహం
## చిన్నపట్టణాల్లోనూ ముందుకు వస్తున్న దాతలు

హైదరాబాద్,మార్చి30 : శాంతి భద్రతల పరిరక్షణలో సీసీకెమెరాల పాత్ర కీలకంగా మారింది. దీంతో పోలీసులు వీటిని ఏర్పాటు చేసేందుకు ఎక్కడిక్కడ ప్రోత్సహిస్తున్నారు. సిసి కెమెరాల ఏర్పాటుకు సంఘాలను పిలిచి మాట్లాడుతున్నారు. ఓ మోస్తరు పట్టణంలో ఇప్పుడు వీటి ఏర్పాటు సాగుతోంది. 33 జిల్లాల కేంద్రాలతో పాటు చోటమోటా పట్టణాల్లో కూడా వీటి ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నారు. స్థానికంగా ఉన్న వ్యాపారులను ఇతరలను పిలిచి మాట్లాడుతున్నారు. ఇటీవల అనేక కేసుల్లో సిసి కెమెరాల ఫుటేజీ బాగా పనికి వస్తోంది. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో అవి కీలకంగా మారాయి. అందుకే కాలనీలు మొదలు,రోడ్లకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్నారు. దాతల నుంచి సహకారం తీసుకుని సిసి కెమెరాల ఏర్పాటును చేయిస్తున్నారు. సిసి కెమెరాలు ఉన్నచోట జరిగే నేరాల్లో త్వరాగా ఫలితాలు వస్తున్నాయని డీజీపీ మహేందర్ రెడ్డి కూడా ప్రకటించారు. ఇకపోతే నగరంలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు గతంలోనే డిజిపి తెలిపారు. ప్రజా భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అనివార్యమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోనే గొలుసు చోరీలను నివారించ గలిగినామని మహేందర్ రెడ్డి తెలిపారు. సీసీ కెమెరాలు అలసిపోయేవి కావని, 24గంటలు పనిచేస్తూనే ఉంటాయని, దీని ద్వారా నేరగాళ్ల ఆచూకిని త్వరగా గుర్తించే వీలుంటుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్న ఎనిమిదిగంటల మాత్రమే నిఘా ఉండగలరని, అంతకుమించి ఉండే పరిస్థితి ఉండదన్నారు. ఒకవేళ నేరగాళ్లను గుర్తించిన కేసుల సమయంలో సాక్ష్యులుగా వీరు ఉండలేరని, అదే సీసీ కెమేరాలైతే నిజనిర్ధారణ వేగంగా అవుతుందన్నారు. కోర్టుల్లో కూడా సీసీ కెమెరాల ద్వారా ఎటువంటి సంశయం లేకుండా శిక్షలు విధించే అవకాశాలు ఉంటాయని డీజీపీ తెలిపారు. అందుకే నగరంలో అన్ని ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రాన్ని నేరరహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తున్నది. దానికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తున్నది. దేశంలోనే తెలంగాణ పోలీసింగ్‌కు మంచి గుర్తింపు కూడా వచ్చింది. దానిని కాపాడుకుంటూ మరింత పేరుపొందేలా, ప్రజల్లో భరోసా కల్పించేలా ముందుకు సాగుతున్నారు.

## ఆర్టీసీ ఛార్జీలు ఇంకా పెరుగతాయి: ఛైర్మన్

హైదరాబాద్,మార్చి30: పెరిగిన సెస్ చార్జీలతో ప్రభుత్వానికి ఏలాంటి సంబందం లేదని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ స్పష్టం చేశారు. ఆర్టీసీ చార్జీల పెంపు కాదు ఇవి సెస్ చార్జీలు మాత్రమే.. భవిష్యత్తులో ఆర్టీసీ చార్జీలు ఇంకా పెరుగుతాయని తెలిపారు. టోల్ ప్లాజా డబ్బులు టీఎస్ఆర్టీసీ చెల్లిస్తుందన్నారు. ఏటా 70 నుండి 100 కోట్లు ఆర్టీసీ నష్టపోతున్నామని తెలిపారు. ఆర్టీసీ లాభాల కోసమే చార్జీల పెంపు అని చెప్పుకొచ్చారు. ఇంత చేసిన రోజు 6 కోట్ల రూపాయల నష్టపోతున్నామన్నారు. కొత్త బస్సులు ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు.

## కేంద్రం కులగణన చేపట్టాల్సిందే

**అప్పుడే అభివృద్ధి కార్యాక్రమాల అమలు సాధ్యం**
**కులగణన కోసం పార్లమెంటులో టీఆర్‌ఎస్ డిమాండ్**
**వాయిదా తీర్మానాలపై చర్చించాలని పట్టు**

న్యూఢిల్లీ,మార్చి30: కుల గణన చేపట్టాలని టీఆర్ఎస్ ఎంపీలు డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన వాయిదా తీర్మానం నోటీసును ఉభయసభల్లో టీఆర్ఎస్ ఎంపీలు నామా నాగేశ్వర్ రావు, కే కేశవరావు ఇచ్చారు. ఈ అంశంపై చర్చ జరపాలని ఎంపీలు కోరారు. కానీ టీఆర్ఎస్ ఎంపీలు ఇచ్చిన వాయిదా తీర్మానం నోటీసును ఇటు స్పీకర్, అటు చైర్మన్ తిరస్కరించారు. దీంతో ఉభయసభల నుంచి టీఆర్ఎస్ ఎంపీలు వాకౌట్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన టీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వర్ రావు రాష్ట్ర ప్రజలకు సంబంధించిన ప్రతి అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తుతున్నామని తెలిపారు. కుల గణనపై వాయిదా తీర్మానం నోటీసు ఇచ్చాం. దాని మీద చర్చ జరగాలని కోరాం. కానీ తమ నోటీసును తిరస్కరించారు. అందుకే సభ నుంచి వాకౌట్ చేశామని తెలిపారు. కుల గణన చేపట్టాలని టీఆర్ఎస్ పార్టీ ఎప్పట్నుంచో డిమాండ్ చేస్తున్నామని, కేంద్ర మాత్రం మొండికేస్తోందని నామా ధ్వజమెత్తారు. 92 ఏళ్ల క్రితం కుల గణన జరిగింది. అప్పటి నుంచి ఏ ప్రభుత్వం కుల గణన గురించి పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కులగణన చేపట్టాలని తెలంగాణ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని ఎంపీ నామా నాగేశ్వర్ రావు గుర్తు చేశారు. ఓబీసీలకు పార్లమెంట్, అసెంబ్లీలో రిజర్వేషన్లు ఇవ్వాలని 2014లో తీర్మానం చేసి పంపించామని తెలిపారు. జాతీయ స్థాయిలో ఓబీసీలకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలని తీర్మానం పంపించామన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రానికి చెందిన ఇతర పార్టీల ఎంపీలు ఒక్కసారైనా పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల పక్షాన నిలబడ్డారా? అని ప్రశ్నించారు. ఇతర పార్టీల ఎంపీలు ఆందోళన చేస్తే.. వారికి మద్దతుగా ఉండి, పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని నామా నాగేశ్వర్ రావు స్పష్టం చేశారు.

## వడ్లను కేంద్రమే కొనాలి

**తీర్మానాలు చేసి కేంద్రానికి పంపిన జడ్పీలు**

హైదరాబాద్,మార్చి30: తెలంగాణ రైతులు పండించిన వడ్లను కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాష్ట్రంలోని పలు జిల్లా ప్రజా పరిషత్‌లు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. ఈ మేరకు తీర్మాణం కాపీలను ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్‌కు పంపించారు. వరంగల్ జెడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక సర్వ సభ్య సమావేశం నిర్వహించి ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జెడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక సర్వ సభ్య సమావేశంలో తీర్మానం చేశారు. అలాగే రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డి అధ్యక్షతన ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు.

## హైదరాబాద్ చేరుకున్న మంత్రి కేటీఆర్

ముగిసిన అమెరికా పర్యటన

హైదరాబాద్,మార్చి30: రాష్ట్రానికి భారీ పెట్టుబడులే లక్ష్యంగా 12 రోజులపాటు అమెరికాలో పర్యటించిన మంత్రి కేటీఆర్ హైదరాబాద్ చేరుకున్నారు. పెట్టుబడుల సాధనకోసం మంత్రి కేటీఆర్ బృందం ఈనెల 18న అమెరికా వెళ్లింది. అక్కడ వివిధ కంపెనీల అధిపతులతో చర్చలు జరిపారు. ఫార్మా, లైఫ్‌సెన్సెస్, ఎలక్ట్రికల్ వెహికల్, ఫిష్ ప్రాసెసింగ్, ఐటీ కంపెనీలు రాష్ట్రంలో రూ.8 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చాయి. ఈ మేరకు ఆయా కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చు కున్నారు. న్యూయార్క్‌లోని అడ్వెంట్ ఇంటర్నేషనల్ కంపెనీ రూ.1,750 కోట్లతో హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడానికి ముందుకొచ్చింది. అదేవిధంగా న్యూజెర్సీ కేంద్రంగా పనిచేస్తున్న స్లేబ్యాక్ ఫార్మా సంస్థ సీఈవో అజయ్‌సింగ్ రూ.150 కోట్లు పెట్టుబడి పెడుతామని ప్రకటించారు. మెడికల్ డివైజెస్ తయారీ సంస్థ ఫార్మకోపియా రూ.1,525 కోట్లతో హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో అధునాతన ల్యాబ్ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది.

## వచ్చే ఏడు లక్ష వరకు ఉన్న రుణాలు పూర్తిగా మాఫీ

**వ్యవసాయన శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

వనపర్తి,మార్చి30: వచ్చే ఏడాది రూ. లక్ష వరకు ఉన్న రుణాలు పూర్తిగా మాఫీ అవుతాయని వ్యవసాయన శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభలో మంత్రి పాల్గొన్నారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతు ఆర్థికంగా ఎదగాలన్నదే కేసీఆర్ ఆశ అని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు అప్పులు చేసే పరిస్థితులు తగ్గిపోయాయన్నారు. సమయానికి రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లోకి చేరుతు న్నాయని ఆయన తెలిపారు. పెట్టుబడి కోసం ఎవరి మీద ఆధారపడాల్సిన పరిస్థితి లేదన్నారు. కరోనా విపత్తు కారణంగా రైతుల రుణమాఫీ ఆలస్యమయింది వాస్తవమేనన్నారు. ఆర్థిక వనరుల లేమి కారణంగా ఇప్పటి వరకు రూ.36 వేల వరకు ఉన్న వారి రుణాలు మాఫీ అయ్యాయని ఆయన తెలిపారు. వనపర్తి : తెలంగాణ రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం కేసీఆర్ ఆశయమని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. జిల్లాలోని వనపర్తి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభకు మంత్రి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు అప్పులు చేసే పరిస్థితులు తగ్గిపోయాయి. సమయానికి రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లోకి చేరుతున్నాయి. పెట్టుబడి కోసం ఎవరి మీద ఆధారపడాల్సిన పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసి ఆదాయం గడించాలన్నారు. కరోనా విపత్తు కారణంగా రైతుల రుణమాఫీ ఆలస్యమయిందని, రుణమాఫీని కచ్చితంగా చేసి తీరుతామన్నారు.

# యాదాద్రి దర్శన్ పేరుతో ఆర్టీసీ బస్సు సర్వీసులు

### ఉప్పుబస్ స్టాండ్ నుంచి నిరంతరంగా మినీ బస్సులు
### బస్సులను ప్రారంభించిన సజ్జన్నార్, బాజిరెడ్డిలు
### ఆర్టీసీలో బలవంతపు వీఆర్ఎస్ లేదన్న ఎండి సజ్జన్నార్

హైదరాబాద్,మార్చి30: యాదాద్రి ఆలయ పునఃప్రారంభంతో ఆర్టీసీ కూడా అప్రమత్తం అయ్యింది. భక్తుల సౌకర్యార్థం ఉప్పల్ బస్టాండ్ నుంచి యాదాద్రికి వందకుపైగా మినీ బస్సులు అందుబాటులో ఉన్నాయని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చెప్పారు. ప్రతి జిల్లా కేంద్రం నుంచి ఉప్పల్ సర్కిల్‌కు, అక్కడి నుంచి యాదగిరిగుట్టకు మినీ బస్సులు నడుపుతున్నామని చెప్పారు. లక్ష్మీనరసింహ



స్వామివారి మూలవిరాట్ దర్శనాలు పునఃప్రారంభమైన నేపథ్యంలో భక్తుల కోసం యాదాద్రిదర్శిని పేరుతో ఆర్టీసీ మినీ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉప్పల్ నుంచి మినీ బస్సు సర్వీసులను ఎండీ సజ్జనార్‌తో కలిసి ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ ప్రారంభించారు. అనంతరం ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. అన్ని జిల్లా కేంద్రాల నుంచి యాదాద్రికి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. జేబీఎస్ నుంచి రూ.100, ఉప్పల్ నుంచి రూ.75గా టికెట్ ధరను నిర్ణయించామని వెల్లడించారు. ప్రతి రోజూ 104 సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రైవేట్ వాహనాల కంటే ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సాఫీగా సాగుతుందని చెప్పారు. వినూత్నంగా రూపుదిద్దుకున్న తెలంగాణ తిరుపతి యాదాద్రికి భక్తులు పోటెత్తుతున్నారు. యాదాద్రికి వెళ్ళే భక్తులకు ఆర్టీసీ శుభవార్త తెలిపింది. ఉప్పల్ నుండి యాదాద్రికి ప్రత్యేక మినీ ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జనార్. యాదాద్రి ఆలయం ప్రారంభమైన నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం యాదాద్రి కొండ పైకి యాదాద్రిదర్శిని పేరుతో బస్సులు ఏర్పాటుచేశారు. ప్రభుత్వానికి పెరిగిన సెస్ చార్జీలతో ఎలాంటి సంబంధం లేదు. ఆర్టీసీ చార్జీల పెంపు కాదు సెస్ చార్జీలు మాత్రమే పెంచాం. టోల్ ఎ÷-లాజా డబ్బులు టిఎస్ ఆర్టీసీ చెల్లిస్తుంది. ఏటా 70 నుండి 100 కోట్లు ఆర్టీసీ నష్టపోతోంది. ఆర్టీసీ లాభాల కోసమే చార్జీల పెంపు. ఇంత చేసిన రోజు 6 కోట్ల రూపాయల నష్టపోతున్నాం. త్వరలోనే కొత్త బస్సులు ఏర్పాటు చేస్తాం అన్నారు. వీఆర్ఎస్‌కు రెండు వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారని సజ్జనార్ తెలిపారు. వీఆర్ఎస్ కోసం ఉద్యోగులను బలవంతం చేయట్లేదన్నారు. ఉద్యోగుల వీఆర్ఎస్ సంఖ్యనుబట్టి ప్యాకేజీ సిద్ధం చేస్తామన్నారు. వీఆర్ఎస్ తేలినతర్వాత ఆర్టీసీ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని వెల్లడించారు. ఆర్టీసీలో రెండువేలమంది ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అందుకే వారు వీఆర్ఎస్ కావాలను కుంటున్నారు. ఇంకా ఎంత మంది వస్తారో చూసి ఆ దిశగా ప్రయత్నాలు చేస్తాం అని ఎండీ సజ్జనార్ వివరించారు.

## మహేశ్ బ్యాంక్ హ్యాకింగ్‌ను చేధించిన పోలీసులు

### బ్యాంక్ నిర్లక్ష్యం కారణంగానూ సులువుగా హ్యాకింగ్
### వందమంది పోలీసులలతో ప్రత్యేక బృందాల ఏర్పాటు
### పలు రాష్ట్రాల్లో శోధించి కేసును పరిశోధించిన బృందాలు
### 2నెలల పాటు విచారణలో నిందితుల గుర్తింపు
### అయినా దొరకని ప్రధాన నిందితుడు ఆచూకీ
### రెడ్‌కార్నర్ నోటీస్ జారీచేసి పట్టుకుంటామన్న సీపీ ఆనంద్

హైదరాబాద్,మార్చి30: మహేష్ బ్యాంక్ సర్వర్ హ్యాకింగ్ కేసును పోలీసులు ఎట్టకేలకు చేధించారు. మహేష్ బ్యాంకు నిధుల గోల్మాల్ కేసులో కీలక పురోగతి కనిపించింది. పదిమంది నిందితులను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను బుధవారం మధ్యాహ్నం మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ మేరకు పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వివరాలు తెలిపారు. మహేష్ బ్యాంక్‌పై సైబర్ దాడి చిక్కు ముడిని విప్పేందుకు పోలీసులు బ్యాచ్‌ల వారిగా విడిపోయి రంగంలోకి దిగారు. అందులో భగంగా ఢిల్లీ, బెంగళూరు, పుణె, ముంబయి సహా ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లిన సీసీఎస్ బృందాలు నిందితులను వలపన్ని పట్టుకున్నాయి. మహేష్ బ్యాంక్ హ్యాకింగ్ కేసులో 2 నెలల పాటు విచారణ చేసినట్టు సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. 100 మంది పోలీస్ ఆఫీసర్స్‌తో కేసు విచారణ చేశామన్నారు. ఏ కేసుకు ఖర్చు కానీ నగదు, మహేష్ బ్యాంక్ కేసులో ఖర్చు అయ్యిందన్నారు. టీఏ, డీఏలతో కలిపి ఈ కేసులో 58 లక్షలు రూపాయలు ఖర్చు అయ్యిందని సీపీ తెలిపారు. హ్యాకింగ్ అనేది ఆందోళన కలిగించే అంశంగా చూడాలన్నారు. ఆర్బీఐ నిబంధనలు పాటించకుండా బ్యాక్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రజల సొమ్ముతో బ్యాంక్‌లను నడుపుతున్నా కూడా నిబంధనలు పాటించక పోవడం, నిర్లక్ష్యం చేయడంతోనే ఇలాంటివి జరుగుతున్నాయని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. బ్యాంకు సర్వర్లను హ్యాక్ చేసి నేరగాళ్లు నిధులను కొట్టేశారు. బ్యాంకు ఖాతాలతో పాటు సర్వర్‌లో చొరబడి 14 కోట్లను సైబర్ నేరగాళ్లు కాజేశారు. నిధులు కాజేసిన ప్రధాన సూత్రధారిని నగర పోలీసులు గుర్తించారు. నైజీరియా నుంచే బ్యాంకు సర్వర్లను హక్ చేసి డబ్బు కొట్టేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు ఇదే తరహాలో మూడు బ్యాంకుల నిధులను నేరాగాళ్లు కొట్టేశారు. అందులో.. మహారాష్ట్రలో బ్యాంక్ ఆఫ్ బరోడా, తెలంగాణ కోపరేటివ్ బ్యాంకు, మహేష్ నిధులను లూటీ చేశారు. మహేష్ బ్యాంకు కేసులో ఇప్పటి వరకు 23 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. భారత్‌లో ఉండి నైజీరియన్‌కి సపోర్ట్ చేసిన



కీలక సూత్రధారి అదుపులోకి తీసుకున్నారు. బ్యాంకుల దోపిడిలపై కీలక విషయాలను హైదరాబాద్ సీపీ ఆనంద్ వెల్లడించారు. అయితే ప్రధాన హ్యాకర్ దేశంలో లేడు.. ఎక్కడ ఉన్నాడో తెలియదన్నారు. 24 మంది హ్యాకర్లను అరెస్ట్ చేశాము. స్టీఫెన్ ఒర్జీ సెకెండ్ లెవల్ హ్యాకర్ ను అరెస్ట్ చేశాం. ఐపీ అడ్రెస్‌లతో ఉన్న ప్రధాన హ్యాకర్ ను అరెస్ట్ చేయాలి. రెడ్ కార్నర్ నోటీస్ జారీ చేసి నిందితుడిని పట్టుకొస్తాం. ఢిల్లీలో ఉన్న ఇంట్రా సాఫ్ట్ అనే కంపెనీ బ్యాంక్‌లకు సాఫ్ట్‌వేర్ ఇస్తున్నారు. చాలా బ్యాంక్‌లకు వీరు సాఫ్ట్ వేర్ అందజేస్తున్నారు, కానీ సరైన సైబర్ సెక్యూరిటీ లేకుండా అందిస్తున్నారు. ఈ కేసులో వీరి ప్రమేయం ఏమైనా ఉందా అనేది నోటీసులు ఇచ్చి విచారణ చేస్తామన్నారు. నవంబర్ నెలలో మహేష్ బ్యాంక్ 200 మంది ఉద్యోగులకు ఫిషింగ్ మెయిల్స్ హ్యాకర్ పంపాడు. ఇద్దరు ఉద్యోగులు మెయిల్ ఓపెన్ చేయగానే..
హ్యాకింగ్ కు సులువు అయింది. మహేష్ బ్యాంక్ సింగిల్ నెట్వర్క్ తో నడిపిస్తున్నారు. బ్యాంక్ వ్యవస్థలో ఒకే నెట్వర్క్ వాడకూడదు. బ్యాంకింగ్ వ్యవస్థకు ఫైర్ వాల్స్ ఏర్పాటు చేసుకోవాలి..కానీ మహేష్ బ్యాంక్ అలాంటిది ఏమి ఏర్పాటు చేసుకోలేదన్నారు. మహేష్ బ్యాంక్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల హ్యాకింగ్ చేయడం సులువు అయింది. 7గురు ఖాతాదారులను సంప్రదించి 10శాతం కమిషన్‌కు నగదు బదిలీలు జరిగాయి. 7 అకౌంట్స్..115 అకౌంట్స్ అక్కడి నుంచి 3వందల ఖాతాలు తెరిపించారు.ఫిషింగ్ మెయిల్స్ స్విట్జర్లాండ్- వేరే వేరే దేశాల్లో చూపిస్తున్నాయి.ఐపి అడ్రస్‌లు కెనడా నుంచి పాట్నా- పాట్నా నుంచి యూకే అని ఫేక్ అడ్రస్ లు ఇచ్చారని సీవీ ఆనంద్ అన్నారు.

## ప్రజలకు అందుబాటులో అన్నిరకాల వైద్య సేవలు

### మరింత విస్తృతంగా 108 అంబులెన్స్ సేవలు
### సకాలంలో అంబులెన్స్ సేవలు అందేలా కృషి
### అంబులెన్స్ సర్వీసులను ప్రారంభించిన మంత్రులు



హైదరాబాద్,మార్చి30: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నారని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణ ఏర్పాటు తర్వాత అత్యవసర సమయంలో ఆస్పత్రులకు చేర్చే 108 అంబులెన్స్ సేవలను మరింత విస్తృతం చేసుకున్నామని చెప్పారు. వాటి సంఖ్యను 430కి పెంచుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. వెంగళ్రావ్ నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ కలిసి అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ రోజు రెండు అంబులెన్స్‌లు ప్రారంభించుకున్నాం. ఇందుకు సహకరించిన ఇండస్ ఇండ్ బ్యాంక్ వారికి కృతజ్ఞతలు. మరో 8 ఇవ్వడానికి ముందుకు వచ్చారు. సీఎస్ఆర్ కింద వీటిని సమకూర్చడం సంతోషకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సగటున 15-20 నిమిషాల్లో అంబులెన్స్ సేవలందుతున్నాయి. ఈ సమయాన్ని మరింత తగ్గించేందుకు లక్ష్యం ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. తక్షణ వైద్యాన్ని అందించేలా ఈ అంబులెన్సుల్లో బేసిక్ లైఫ్ సపోర్టు వ్యవస్థ ఉందన్నారు. అత్యవసర వైద్యం అందించి ఆసుపత్రికి చేరే లోగా ప్రాణాలు కాపాడే అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు సిస్టం కలిగిన అంబులెన్స్‌లు ఉన్నాయి. ఏప్రిల్ 2021 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు నాలుగున్నర లక్షల మందికి సేవలు అందించడం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ మీద ప్రజల్లో మరింత విశ్వాసం కలిగించేందుకు, అంబులెన్స్ వెళ్లలేని ప్రాంతాలకు సైతం వెళ్లి వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో 50 బైక్ అంబులెన్స్‌లను ప్రభుత్వం ప్రారంభించిందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. మారుమూల గిరిజన ప్రాంత వాసుల కోసం ఐటీడీఏ పరిధిలో, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి పట్టణ పరిధిలో ఇవి సేవలందిస్తున్నాయి. గిరిజన ప్రాంతాల్లో ఉన్న 25 అంబులెన్సులు ప్రతి నెల సగటున 750 ఎమ్జెం÷న్సీ కేసులకు సేవలందిస్తున్నాయి. ఏప్రిల్ 2021 నుంచి ఈ ఏడాది పిబ్రవరి వరకు దాదాపు 19వేల మందికి ఈ 50 బైక్ అంబులెన్స్ సేవలందాయని మంత్రి గుర్తు చేశారు.
మారు మూల ప్లలెల నుండి గర్భిణులను ఆసుపత్రులకు, తిరిగి ఇంటికి చేర్చేందుకు 300 అమ్మ ఒడి వాహనాలను ఏర్పాటు చేసుకున్నాం. 2018 నుంచి ఇప్పటి వరకు 38లక్షల మంది గర్భిణులు రాష్ట్ర వ్యాప్తంగా అమ్మ ఒడి వాహనాల ద్వారా సేవలు పొందారని హరీశ్‌రావు పేర్కొన్నారు. గతంలో ఎవరైనా దవాఖానల్లో మరణిస్తే.. ఆ పార్థీవ దేహాలను సొంతూళ్లకు తీసుకువెళ్లడం పెద్ద సమస్యగా ఉండేది. ఈ కష్టాన్ని, వేదనను మనసుతో అర్థం చేసుకున్న ప్రభుత్వం.. పార్థీవ దేహాలను తరలించేందుకు 50 పరమపద వాహనాలను ఏర్పాటు చేసింది. అవసాన దశలో ఉన్న వారికి వైద్య సేవలు అందించేందుకు గాను దీనికి అదనంగా 30 ఆలన వాహనాలను ఏర్పాటు చేసుకున్నాం. ఇన్ని రకాల వాహనాలు ఏర్పాటు చేయడమే కాదు.. వాటి సేవలు నిర్విరామంగా, నిరాటంకంగా కొనసాగేలా అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటున్నదని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## గిరిజన గ్రామాలకు తక్షణం విద్యుత్ సౌకర్యం

**అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**

హైదరాబాద్,మార్చి30: ప్రభుత్వ ప్రాధాన్యత, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఆదేశాల మేరకు ప్రతి ఆదివాసి, గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ.శాంతి కుమారి అన్నారు. మారుమూల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం, పెండింగ్‌లో ఉన్న పనులపై సంబంధిత జిల్లాల కలెక్టర్లు, విద్యుత్, గిరిజన సంక్షేమం, అటవీ శాఖ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మొత్తం మూడు వేలకు పైగా గుర్తించిన గ్రామాలకు ఇప్పటికే త్రీ ఫేజ్ విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఇంకా మిగిలిన 239 గ్రామాలకు కూడా నెల రోజుల్లో పనులు పూర్తి చేసి విద్యుత్ సౌకర్యం అందిస్తామని వెల్లడించారు. జిల్లాల వారీగా అదిలాబాద్ లో 46, కొమరం భీమ్ ఆసిఫాబాద్ 98, మంచిర్యాల 26, నిర్మల్ 42, భద్రాద్రి కొత్తగూడెంలో 27 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం ఇంకా అందించాల్సి ఉందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాల వారీగా ఉన్న సమస్యలు, అటవీ అనుమతులు, జాప్యం నివారణపై సమీక్షా సమావేశంలో చర్చించారు. అటవీ అనుమతులను వేగంగా ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని, అయితే అవసరమైన డాక్యుమెంటేషన్ సరైన పద్ధతుల్లో పూర్తి చేస్తే ఆలస్యాన్ని నివారించవచ్చని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్.ఎం. డోబ్రియాల్ అన్నారు. గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ ప్రాధాన్యత అని, సంబంధిత శాఖలు పూర్తి సహకారంతో పూర్తి స్థాయి విద్యుత్ సౌకర్యం ఇచ్చేందుకు కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ డాక్టర్ క్రిస్టీనా చోంగ్తు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో అదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు, అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్లు, విద్యుత్ శాఖ (ఎన్.పీ.డీ.సీ.ఎల్) సీఎండీ గోపాల్ రావు, ఎన్ పీడీసీఎల్ / ఎస్ పిడిసిఎల్, సీపీడీసీఎల్ డైరెక్టర్లు, జిల్లా అటవీ శాఖ అధికారులు, విద్యుత్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## వీడిని బాలిక హత్య చిక్కుముడి

**ప్రేమికుడు మహేందర్ పనేనని గుర్తింపు**
**అత్యాచారం చేసి హత్యచేసినట్లు వెల్లడి**

వికారాబాద్,మార్చి30: జిల్లాలో బాలికపై అత్యాచారం హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కోటి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈనెల 28న అంగడి చిట్టెంపల్లిలో మైనర్ బాలికపై అత్యాచారం హత్య చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు అందిందన్నారు. దీని కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 48 గంటల్లో నిందితుడిని గుర్తించామన్నారు. మహేందర్ అనే వ్యక్తి నేరానికి పాల్పడ్డాడని, హత్య చేసినట్టు అతను ఒప్పుకున్నాడన్నారు. ఇద్దరి మధ్య ఏడాది కాలంగా ప్రేమ వ్యవహారం నడుస్తోందని, ఈ ప్రేమ వ్యవహారం బాలిక హత్యకు రెండు రోజుల ముందు మృతురాలి చెల్లెలుకు తెలిసిందని, ఈ విషయం ఆమె ఇంట్లో చెప్పడంతో తల్లి మందలించిందన్నారు. ఇక బయట కలుసుకోవడం కుదరదని భావించి హత్యకు ముందు రోజు ఫోన్ చేసి ఇద్దరం బయట కలుద్దాం అని మాట్లాడుకున్నారని, అనుకున్న విధంగా బాలిక తెల్లవారుజాము మూడు, నాలుగు గంటల ప్రాంతంలో బయటకు వచ్చిందన్నారు. తనతో ఫిజికల్‌గా కలవాలని మహేందర్ ఆమెను బలవంత పెట్టగా.. బాలిక గట్టిగా ప్రతిఘటించిందని, దీంతో ఇద్దరి మధ్య పెనుగులాట జరిగిందని, ఈ నేపథ్యంలో బాలికను మహేందర్ తోయడంతో ఆమె తల పక్కనే ఉన్న చెట్టుకు బలంగా తాకిందని, దీంతో బాలిక స్పృహ కోల్పోయిందన్నారు. అది గమనించకుండా మహేందర్ ఆమెపై హత్యాచారం చేశాడని, అనంతరం బాలికను అక్కడే వదిలేసి వెళ్ళిపోయాడని తెలిపారు. నిందితుడు తన నేరాన్ని ఒప్పుకున్నాడని, అతడిని కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా త్వరితగతిన మహేందర్‌కు శిక్ష పడేలా చూస్తామని ఎస్పీ కోటి రెడ్డి తెలిపారు.

## ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ ఇంటిపై దాడి

**హత్యచేసేందుకు బిజెపి కుట్ర అన్న సిసోడియా**

న్యూఢిల్లీ,మార్చి30: సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఇంటిపై బీజేపీ కార్యకర్తల దాడి కలకలం రేపింది. కశ్మీర్ పండిట్‌లపై కేజ్రీవాల్ వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ కార్యకర్తలు ఆయన ఇంటిపై దాడి చేశారు. సీఎం కార్యాలయం ఫ్రంట్ గేట్‌ను ధ్వంసం చేశారు. సెక్యూరిటీ బారికేడ్లు దాటుకొని దూసుకెళ్లడంతోపాటు సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్టు ఆప్ వర్గాలు వెల్లడించాయి. అయితే



సీఎం ఇంటిపై దాడి ఘటనపై ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా తీవ్రంగా స్పందించారు. ఢిల్లీ పోలీసుల సాయంతో బీజేపీ గూండాలు రెచ్చిపోయారంటూ ట్వీట్ చేశారు. కేజ్రీవాల్ హత్యకు బీజేపీ కుట్ర చేసిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో కేజ్రీవాల్‌ను ఓడించలేకపోవడంవల్లే ఆయనను హత్య చేసేందుకు బీజేపీ వేసుకున్న ముందస్తు పథకం అని ఆరోపించారు. పంజాబ్‌లో ఆప్ విజయం బీజేపీ ఓటమి కారణంగానే బీజేపీ అరవింద్ కేజ్రీవాల్ ను హత్య చేయాలనుకుంటోందని ఆరోపించారు. ఈరోజు బీజేపీ గుండాలు పోలీసుల సమక్షంలోనే సీఎం నివాసం వద్ద సీసీ కెమెరాలు, బారికేడ్‌లను బద్దలు కొట్టారని సిసోడియా విమర్శించారు.

## కాఫీ ప్లాంటేషన్‌కు ఉపాధి కుదరదు

రాజ్యసభలో మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి వెల్లడి

న్యూఢిల్లీ,మార్చి30: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కాఫీ ప్లాంటేషన్ కార్యకలాపాలను అనుమతించబోమని గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి రాజ్యసభలో స్పష్టం చేశారు. విశాఖపట్నంలోని పాడేరు ప్రాంతంలో నిరుపేద గిరిజన రైతుల ప్రయోజనం కోసం ఉపాధి హామీ పథకం కింద కాఫీ ప్లాంటేషన్ అభివృద్ధికి ప్రభుత్వం అనుమతిస్తుందా అని వైఎస్సార్‌సీపీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు జవాబుగా మంత్రి ఈ విషయం చెప్పారు. ఉపాధి హామీ పథకం అనేది డిమాండ్‌ను బట్టి ఉపాధి కల్పించే కార్యక్రమం. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల పేదలకు జీవనోపాధి భద్రత కల్పించాలన్నది ఉద్దేశం. ఈ పథకం కింద ప్రతి ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ పేదలకు వంద రోజులపాటు వేతనంతో కూడిన ఉపాధికి హామీ ఇవ్వడం జరుగుతుందని మంత్రి చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద తమ సొంత భూమిలో వ్యక్తిగత ఆస్తులు సృష్టించుకోవడానికి ప్రభుత్వం అనుమతిస్తుంది. అందులో భాగంగా భూమి అభివృద్ధి పనులు, సాగు చెరువుల తవ్వకం, వ్యవసాయ బావుల తవ్వకం, ఉద్యానవన పంటలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు, కోళ్లు, మేకల షెడ్లు వంటి పనులను చేపట్టవచ్చని మంత్రి తెలిపారు.

# పెళ్లి రోజు అన్నదానం

**కిరాణ సరుకులు పంపిణి**



**జనగామ మార్చి 30 (ప్రజామంటలు):** లయన్స్ క్లబ్ జనగామ డైమండ్స్ ఆధ్వర్యంలో ప్రేమ్ సదనం అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం, కిరాణం సరుకులు లైన్స్ క్లబ్ ఆఫ్ జనగామ డైమండ్స్ సభ్యుడు దారం సత్యనారాయణ స్వరూప రాణిల వివాహ మహోత్సవ సందర్భంగా ఈ కార్యక్రమము నిర్వహించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మునుముందు కూడా చేస్తామని, పుట్టిన రోజులు కూడా ఇలాంటి వృద్ధాశ్రమం నందు చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ గట్టు శ్రీనివాస్, రిటైర్డ్ టీచర్ మా శెట్టి నరసింహ రాములు, లయన్ కందుకూరి నాగరాజు, లయన్ గొడిశాల శివరామకృష్ణ పాల్గొన్నారు.

# కరెంట్ ఇవ్వక పోవడం వలన పంటలు ఎండి పోతున్నాయి

**మానకొండూర్ మార్చి 30 (ప్రజామంటలు):** మానకొండూర్ నియోజకవర్గం శంకరపట్నం మండల కేంద్రంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తానని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం 9 గంటలు కూడా నాణ్యమైన కరెంట్ ఇవ్వక పోవడం వలన పంటలు ఎండి పోతున్నాయని రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ఇటీవల భారీగా పెంచిన విద్యుత్ ఛార్జ్ లకి నిరసనగ ఈ రోజు శంకరపట్నంలో మండల బీజేపీ శాఖ అధ్వర్యంలో, బీజేపీ మండల అద్యక్షులు చల్ల ఐలయ్య నేతృత్వంలో కరీంనగర్-హనంకొండ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించడమైనది. ఈ కార్యక్రమములో కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ పట్నాల్లో పాల్గొన్న జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్



**జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణంలో ప్రతి 5 సంవత్సరాలకు ఒక సారి నిర్వహించే కురుమ సంఘం పుల్ల వారి శ్రీ రేణుక ఎల్లమ్మ పట్నాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన జగిత్యాల జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ దావ వసంత సురేష్. వెంట కౌన్సిలర్లు కూతురు రాజేష్, కోరే గంగమల్లు, కూసరి అనిల్, తోట మల్లికార్జున్, పట్టణ యూత్ అధ్యక్షుడు కత్తురోజు గిరి, ఉపాధ్యక్షుడు ఏనుగుల రాజు, యూత్ నాయకులు కూతురు శేఖర్, నరేష్, హరీష్ మరియు కురుమ సంఘ సభ్యులు, తదితరులు ఉన్నారు.

# నిరాహార దీక్ష టెంటు తీసేసిన దుండగులను శిక్షించాలి

**సిపిఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్**




**జనగామ మార్చి 30 (ప్రజామంటలు):** జనగామ పట్టణంలో కలెక్టర్ కార్యాలయం ముందు ఇందిరమ్మ ఇండ్ల డబల్ బెడ్ రూమ్ లు పూర్తి చేసి ఇవ్వాలని రిలే నిరాహార దీక్షలు చేస్తుండగా రాత్రికి రాత్రి టెంటు తీసినా జెండాను తీసివేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని వారిపై కేసు నమోదు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ హెచ్చరించారు. బుధవారం మూడవ విడత ఇందిరమ్మ ఇండ్ల సాధన కమిటీ, సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించి ప్రసంగించారు. రాత్రికి రాత్రి టెంటు తీసి జెండాను అవమానపరిచిన వారిపై కేసు నమోదు చేసి వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జనగామ పట్టణ కమిటీ సభ్యులు పందిళ్ళ కల్యాణి, విడత ఇందిరమ్మ ఇండ్ల సాధన కమిటీ అధ్యక్షులు కళ్యాణం, లింగం, తూడి దేవదానం, బూడిద అంజమ్మ, గాడి సుభాషిని, ఎర్ర అనిత, చీర రజిత, మూడవ విడత ఇండ్ల సాధన కమిటీ నాయకులు తాల్లపల్లి రాజు, ఎండీ యాకూబ్ పాషా, జయ, జ్యోతి, సునంద, శ్రీదేవి, గంగ కౌర్, ఆనంద్ కౌర్, అనిత, ఉమారాణి, పద్మ, సంజీవ్ పాల్గొన్నారు.

# తెలంగాణ జన సమితి రైతు విభాగం

**రాష్ట్ర అధ్యక్షునిగా కంతి మోహన్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం మార్చి 30 (ప్రజామంటలు):** తెలంగాణ జన సమితి అనుబంధ విభాగం అయిన తెలంగాణ రైతు జన సమితి రాష్ట్ర అధ్యక్షునిగా కంతి మోహన్ రెడ్డిని నియమించినట్లు ప్రో. కోదండరాం మంగళవారం హైదరాబాద్ లోని పార్టీ కార్యాలయంలో ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక విలేఖరుల తో కంతి మోహన్ రెడ్డి మాట్లాడుతూ.... రాష్ట్రవ్యాప్తంగా రైతు సమస్యలపై నిరంతర పోరాటం చేయడంతో పాటు రైతు విభాగం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అనంతరం తన మీద విశ్వాసం తో రైతు సమితి అధ్యక్షునిగా నియమించిన ప్రో: కోదండరాం కు కృతజ్ఞతలు తెలిపారు. మోహన్ రెడ్డి నియామకం పట్ల కోరుట్ల నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉత్తర తెలంగాణ దివ్య క్షేత్రంగా శ్రీ వెంకటేశ్వర ఆలయ నిర్మాణం చేపడతాం

**మంత్రి గంగుల కమలాకర్**



కరీంనగర్ మార్చి 30 (ప్రజామంటలు): కరీంనగర్ పట్టణం లో అత్యంత సుందరంగా నిర్మించబోయే టీటీడీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణానికి పద్మనగర్ పశుసంవర్ధక శాఖ కార్యాలయ ఆవరణలోని స్థలాన్ని బిసి మరియు పౌరసరపరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ టీటీడీ మాజీ బోర్డు మెంబర్ దామోదర్ రావు, జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్, నగర మేయర్ వై సునీల్ రావుతో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.... కరీంనగర్ లో ఉత్తర తెలంగాణ దివ్య క్షేత్రంగా టీటీడీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఏడాదిన్నర లోగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తాం అన్నారు. భక్తులకు అత్యంత ప్రీతి పాత్రుడైన శ్రీనివాసుని ఆలయాన్ని సీఎం కేసీఆర్ సంకల్పంతో భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తాం. పది ఎకరాల స్థలంలో అత్యంత సుందరంగా తిరుమల తిరుపతి ఆలయాన్ని తలపించేలా ఆలయ నిర్మాణం జరుగుతుంది అని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, స్థానిక కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, కార్పొరేటర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పేరుకే స్మార్ట్ సిటీ, నగరంలో అనేక సమస్యలు

**నగరం ప్రజా సమస్యలపై పోరాడుతాం - సీపీఎం**



**కరీంనగర్ మార్చి 30 (ప్రజామంటలు):** కరీంనగర్ పట్టణం కోతి రాంపూర్ లోని ముకుంద లాల్ మిశ్రా భవన్లో సిపిఎం నగర కమిటీ సమావేశం కామ్రేడ్ పి. మురళి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.... ఏప్రిల్ 3న కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు, బస్ చార్జీలు పెంచి పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారాలు మోపుతోందని, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను రోజు, రోజుకు పెంచుతుందని, పెరిగిన ధరలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా 3వ తేదీన నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నగర కార్యదర్శి గుడికందుల సత్యంలు మాట్లాడుతూ.... కరీంనగర్ పట్టణం పేరుకే స్మార్ట్ సిటీ గా ఉందని,నగరంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తలాపున లోయర్ మానేరు డ్యాం ఉన్నప్పటికీ కరీంనగర్ ప్రజలకు మంచినీటి కొరత ఉందని, రెండు మూడు రోజులకు ఒకసారిమున్సిపల్ వాటర్ సప్లై చేస్తున్నారని అన్నారు. మిషన్ భగీరథ లో ప్రతిరోజు నీరు అందిస్తామని చెప్పిన మాటలు ఆచరణకు నోచుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ పట్టణంలోని అర్హులైన పేదలందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ రెండో వారంలో సిపిఎం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తామని, ఎండ తీవ్రత అధికంగా ఉన్నత రీత్యా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని,పట్టణంలో పేదలకి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నగర కమిటీ సభ్యులు మురళి, పున్నం రవి, కొంపల్లి సాగర్, జి. శారద, కే. అరవింద్, నాయకులు సురేష్, సంతోష్ పాల్గొన్నారు.

# దళితబంధులో మంత్రులు, ఎమ్మెల్యేల రాజకీయ జోక్యాన్ని ప్రతిఘటించండి



**జనగామ మార్చి 30 (ప్రజామంటలు):** రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దళితుల ఆర్థికాభివృద్ధికి తీసుకొచ్చిన దళిత బంధు దళితుల జీవితాలలో ఆర్థికప్రగతికి దోహద పడుతుందనుకుంటే మంత్రులు, ఎమ్మెల్యేల రాజకీయ జోక్యంతో గులాబీలూటీ పథకంలా మారిందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్ల గణేష్ అన్నారు. జనగామ పట్టణ కేంద్రంలోని ప్రెస్టన్ స్కూల్ ఆవరణలో ఎన్పిఆర్డి జనగామ జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు పాముకుంట్ల చందు అధ్యక్షతన ఏర్పాటు చేయగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఎంపిక లో దళిత వికలాంగుల ప్రస్తావనే లేదని, తక్షణమే ఎంపిక చేసిన జాబితాను రద్దుచేయాలని గ్రామాల వారీగా నిరుపేద దళితులను, 2016 చట్టం ప్రకారం దళిత వికలాంగులకు కేటాయించిన వాటా ప్రకారం మళ్ళీ ఎంపిక జరిపి అర్హులైన వారికి దళితబంధు వర్తింప చేయాలని అన్నారు. ప్రభుత్వం జనగామ జిల్లాలో కొన్ని మండలాలను పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేయగా అధికారపార్టీ ప్రజాప్రతినిధులు వారి కుటుంబసభ్యులకు, బంధువులకు, ముఖ్యకార్యకర్తలకు ఈ పథకం వర్తింపజేస్తూ అసలైన అర్హులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా దళితులు వేలసంఖ్యలో ఉండగా అతితక్కువ మందిని ఎంపిక చేయడంపై మిగతా దళితులలో ఆందోళన, గందరగోళం ఏర్పడుతుందన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం సెక్షన్ 37(బి) ప్రకారం అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలలో 5 శాతం వికలాంగులకు కేటాయించాలని, అలాగే సెక్షన్ 24(1) ప్రకారం సాధారణంగా ఇచ్చే లబ్ధిలో 25 శాతం అదనంగా వికలాంగులకు ఇవ్వాలని తెలిపారు. ఈ దళితబంధు పథకంలో మంత్రులు, ఎమ్మెల్యేల రాజకీయ జోక్యం లేకుండా ప్రతిఘటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడెం రాములు, తోట సురేందర్, ఉప్పరి వేణు, బండవరం శ్రీదేవి, మామిడాల రాజేశ్వరి, ఇట్టబోయిన మధు, ఆకారపు కుమార్, మాలోతు రాజ్ కుమార్, మోతే వెంకటమ్మ, ఎడ్ల రమాదేవి, పులి మంజుల, పిట్టల కుమార్, పులిగిల్ల రాజయ్య, బైరగోని మహేష్, రావుల శ్రీనివాస్, కానుగు బాలనర్సయ్య, నాచు అరుణ, ఒంద్రు శ్రీశైలం, గొడుగు రాజవ్వ, పిట్టల రజిత పాల్గొన్నారు.

# పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి

**డెవలప్మెంట్ చార్జీలను రద్దు చెయ్యాలి**

**విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా రాస్తారోకో**



మానకొండూర్ మార్చి 30 (ప్రజామంటలు): మానకొండూర్ మండల కేంద్రంలో బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో పెంచిన విధ్యుత్ చార్జీలకు నిరసనగా బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పాని తిరుపతి అధ్యక్షతన రాస్తారోకో నిర్వహించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ సంక్షేమ ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొనే రాష్ట్ర ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజలపై విద్యుత్ చార్జీల పెంపు అదేవిధంగా డెవలప్మెంట్ చార్జీల పేరుతో మోయలేని భారాన్ని మోపిందన్నారు. ప్రభుత్వ సంస్థ ల బకాయిలే 12700 కోట్లు ఉన్నా వారివి వసూలు చెయ్యడం చేత కాక పేద మధ్యతరగతి ప్రజలపై భారం మోపడం సిగ్గుచేటన్నారు. సమన్యాయం ఉండాలి కానీ ఇలా ఇంకొకరి పై భారం పెట్టడం చేతకాని తనం అవుతుందన్నారు. కాబట్టి పాలన చేతకాక పోతే దిగిపోవాలి కానీ ఇలా బస్సు చార్జీలు, విద్యుత్ చార్జీలు రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతూ ప్రజలను ఇబ్బంది పెట్టాలని చూస్తే భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని తెలిపారు. ఇప్పటికైనా డెవలప్మెంట్ చార్జీలు రద్దు చేసి విద్యుత్ చార్జీల పెంపును ఆపక పోతే ప్రగతి భవన్ ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మియాపురం లక్ష్మణా చారీ, మండల నాయకులు, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ కాలువపై కీటకాల బీభత్సం



మనకొండూర్ మార్చి30 (ప్రజామంటలు): కరీంనగర్లో జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలని కరీంనగర్ హైదరాబాద్ రాజీవ్ రహదారి పై కీటకాలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. పెద్ద సంఖ్యలో కీటకాలు వంతెనపై బీభత్సవం సృష్టిస్తున్నాయి. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. రహదారిపై పెద్ద సంఖ్యలో కీటకాలు ముసురుకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీగా కీటకాలు అడ్డుగా రావడంతో.. కొంతమందికి ఏటుగా వెళ్తున్నామో అర్థం కాకుండా పోయింది. దీంతో కొందరు వాహనాదారులు రోడ్డుపై సడెన్ బ్రేక్లు వేసి వాహనాలను పక్కకు నిలిపివేసారు. అయితే సడెన్ బ్రేక్ వేసే క్రమంలో కొందరు వాహనదారులు కిందపడిపోయారు. ముఖ్యంగా బైక్పై వెళ్లే చాలా మంది వాహనాలను నిలిపి రోడ్డు పక్కకు చేరుతున్నారు. కీటకాలు అటాక్ చేయడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రద్దీగా ఉండే రహదారిపై ఈ విధంగా జరగడంతో స్వల్ప ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. గతంలో కూడా కీటకాల వల్ల చాలా ప్రమాదాలు జరిగాయి. ఎంతో మంది ప్రాణాలు కోల్పయిన తర్వాత కరీంనగర్ కమిషనర్ కమలహాసన్ రెడ్డి ఎల్ఎండి ఎస్ఐ ఆధ్వర్యంలో కాలువకు ఇరువైపులా హైమ్యాక్స్ లైట్లను బిగించి వాహనదారులకు అవగాహన కల్పించడానికి సిబ్బందిని ఏర్పాటు చేయడంతో కీటకాల బారి తప్పింది. గతంలా ఇప్పుడు కూడా అధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరోసారి ప్రాణాలు ప్రయాణికులు కోల్పోయేదాక చర్యలు తీసుకునేలా లేరని ప్రజలు మండిపడుతున్నారు. లోయర్ మానేరు డ్యామ్ నుంచి దిగువకు నీటిని నిరాంతరాయంగా వదులడంతో పురుగుల బెడద పెరిగిందని కొందరు అంటున్నారు. రాత్రి సమయంలో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు భయపడిపోతున్నారు.



సిద్దిపేట రెడ్డి ఫంక్షన్ హాల్లో మానకొండూర్ నియోజకవర్గం బెజ్జంకి మండలంలోని చీలాపూర్, ఎర్రవెల్లివాడ గ్రామానికి చెందిన లబ్దిదారులకు దళిత బంధు యూనిట్ల కింద ట్రాక్టర్లను పంపిణీ చేసిన మానకొండూర్ ఎమ్మెల్యే డా. రసమయి బాలకిషన్



మనకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలో మాజీ సర్పంచ్ ఇంట్లో సంవత్సరీక కార్యక్రమంలో పాల్గొన్న కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కవ్వం పెల్లి సత్యనారాయణ



చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండలం నూకపెల్లి గ్రామానికి చెందిన మారంపల్లి నర్సయ్య రోడ్డు ప్రమాదంలో మరణించగా, తెరాస పార్టీ అందించే రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేసిన ఎమ్మెల్యే సుంకే రవిశంకర్.

# శ్రీరామ మందిరం హుండీ లెక్కింపు



**జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు ):** బ్రాహ్మణ వీధిలో గల శ్రీరామ మందిరము హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. మొత్తము 72,788 రూపాయలు ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ రవి కిషన్, చైర్మన్ కా శెట్టి తిరుపతి, ఈఓ సుదర్శన్, భార్గవ్, ప్రశాంత్ అర్చకులు జి. గోపాల్ శర్మ, వాసవి మాత సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# మైసంపల్లీలో బెల్ట్ దందా



**కొహేడ మార్చి 30 (ప్రజామంటలు):** కొహేడ మండలం మైసంపల్లి గ్రామంలో బెల్ట్ షాపులు వ్యాపారం ఇష్టారాజ్యంగా జరుగుతుంది. ఈ నయా దోపిడీకి ప్రజల జేబులు గుల్ల అవుతున్నాయి. మద్యం వ్యాపారులు తమ దందాను గ్రామాల వారీగా వ్యాప్తి చేస్తున్నారు. హుస్నాబాద్, కోహెడ మండలాల్లోని వైన్స్ షాప్ లను ప్రధానంగా చేసుకొని వాటి అధీనంలో ఈ బెల్ట్ దందా నయా దోపిడి గా సాగుతుంది. ఈ బెల్ట్ దందా పై ప్రజలు తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు వైన్ షాప్ ల యజమానులు ఎంఆర్పి ధర కంటే అధికంగా అమ్మవద్దని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కి ప్రతి వైన్ షాప్ ఎంఆర్పి రేట్లకు మించి విక్రయం చేస్తున్నారు. మండలం లోని ప్రతి గ్రామంలో బెల్ట్ దందా దర్జాగా జరుగుతుంది. వైన్స్ నిర్వాహకులు బెల్ట్ షాపులకు అమ్మే వారికి బాటిల్ కి అదనంగా వసూలు చేస్తున్నట్టు తెలుస్తుంది. దీనితో బెల్ట్ షాపు నిర్వాహకులు క్వార్టర్ బాటిల్ కి 50 నుండి 60 రూపాయల చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారని మందు బాబులు ఆరోపిస్తున్నారు.మైసం పల్లి గ్రామంలో కిరాణా షాపు లో కిరాణా సామగ్రితో పాటు మందు సీసాలను కూడా యదేచ్ఛగా అమ్ముతున్నారు. చూసే వారికి అది కిరాణా దుకాణం కానీ అందులో మందు బాబులు పొందిగ్గా మందు సేవిస్తారు. కిరాణా దుకాణం లో మందు ఎంచక్కా దొరకడంతో ఇక ఎల్లవేళలా మందు సేవిస్తున్నారు. మందు వ్యాపారులకు ఎక్సైజ్ అధికారులు అండగా నిలుస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు.దీనితో గ్రామం లోని యువత నిత్యం మందుకు బానిసలుగా మారి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. సాయంకాలం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల మందు బాబులకు అడ్డాగా మారింది. పాఠశాలకు గేటు లేకపోవడం తో నిత్యం పాఠశాలలో మందు బాబులు వీరంగం సృష్టిస్తున్నారు. మందు బాబుల ఆగడాలకు హద్దు అదుపు లేకుండా పోయింది.చెడు దారిలో పడుతున్న యువతను దారిలో పెట్టల్సిన అధికారులే వారికి వంత పాడుతున్నారు. మైసం పల్లి గ్రామంలో ప్రజలు మందుకు అలవాటు పడి వారి కాపురాలు,జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. బెల్ట్ షాపులకు మందు సప్లయ్ చేసే వైన్ షాప్ ల లైసెన్స్ లు రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాప్ ల దందాను కట్టడి చేయడం లో ఎక్సైజ్ అధికారులు విఫలం అవ్తున్నరని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఎక్సైజ్ అధికారులు స్పందించి బెల్ట్ షాపులో మద్యం విక్రయాలు జరగ కుండా కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## రంగనాయక స్వామి దేవాలయానికి నూతన కమిటీ ఎన్నిక



**గొల్లపెల్లి మార్చి 30 (ప్రజామంటలు):** మండలంలోని రంగధాముని పల్లె గ్రామంలో శ్రీ రంగనాయక స్వామి దేవాలయంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షుడు మాటేటి తిరుపతి మాట్లాడుతూ... రంగనాయక స్వామి ఆశీస్సులతో దేవాలయం అభివృద్ధి కోసం కృషి చేస్తానని నా యొక్క ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు చెప్పడం జరిగింది. కమిటీ అధ్యక్షులుగా మాటేటి తిరుపతి, ఉపాధ్యక్షులుగా రాగల్ల శ్రీనివాస్, చింతకింది స్వామి, ప్రధాన కార్యదర్శిగా పెద్దురి రాయమల్లు, సహాయ కార్యదర్శి జెల్ల దేశపతి, ముస్కు రాజిరెడ్డి, కోశాధికారి గా కనపర్తి భాస్కరా చారి, ప్రచార కార్యదర్శి తమ్మల రమేష్ లు ఎన్నికయ్యారు.

## మాణిక్యపురంలో స్వయం స్వపరిపాలన దినోత్సవం



**జనగామ మార్చి 30 (ప్రజామంటలు):** విద్యార్థులలో నిగూఢంగా దాగి ఉన్న క్రీడా, సాంస్కృతిక, సాహిత్య నైపుణ్యాలను పాఠశాల స్థాయిలోనే వెలికి తీసే అవకాశం ఉంటుంది. అందులో భాగంగానే ప్రాథమికోన్నత పాఠశాల మాణిక్యపురంలో సెల్ఫ్ గవర్నమెంట్ డే (స్వయం స్వపరిపాలన దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. ఎమ్. అంజలి తమ గురువైన జయపాల్ రెడ్డి ని పూర్తిగా అభినయిస్తూ ఓరిగామి బొమ్మల ద్వారా పిల్లలకు పాఠాలు బోధించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్పర్సన్ గంగుల అబ్బులు, హెచ్.ఎం. వెంకటరాజు, ఎస్ఎంసి చైర్మన్ వట్టిపల్లి మమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎస్ఎంసి చైర్పర్సన్ ద్వారా బహుమతి ప్రధానం చేశారు.

## జహహె జనతా జవాన్ పౌండేషన్ క్యాలెండరు ఆవిష్కరణ



**జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు):** జయహో జనతా జవాన్ ఫౌండేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వారి నూతన సంవత్సర కార్యాచరణ ప్రణాళిక తో కూడిన క్యాలండర్ ను ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. భారత సైన్యంలో పనిచేస్తున్న ఉద్యోగి వెంకటేష్ జగిత్యాల జిల్లా జయహో జనతా జవాన్ ఫౌండేషన్ ఇంఛార్జి గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంలో... విధినిర్వహణ విరామ సమయంలో ఆయన తన ఇంటికి చేరుకున్నారు. తను ఇంఛార్జిగా ఉన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన ఒక సంవత్సర కాలంపాటు చేయాల్సి విధులు, బాధ్యతలకు సంబంధించిన క్యాలెండర్ ను జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ సిరిసిల్ల శ్రీనివాస్, రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ రాజిరెడ్డి, రాయికల్ మండల అధ్యక్షులు కోల శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు గిరి, రేచపల్లి సర్పంచ్ జయ లక్ష్మా రెడ్డి, ఏ ఎంసీ డైరెక్టర్ స్వామి, నాయకులు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



వేలేరు మండల కేంద్రంలో బుధవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన మంగూరి సాంబరాజు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తు ఉండగా ఇసుక ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపిన ఎస్సై నవీన్ కుమార్.



మానకొండూర్ మండలం లింగపూర్ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి పాస్టర్ల సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన టీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణ రావు



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలో జరిగిన అల్లర్లలో అరెస్టయిన 23 మంది బీజేపీ నాయకులు కరీంనగర్ జిల్లా జైలు నుండి విడుదల

# సొసైటీ సేవలను రైతులు వినియోగించుకోవాలి

**వరి ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని తీర్మానం**



చిగురుమామిడి మార్చి 30 (ప్రజామంటలు): సహకార సంఘం సేవలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి లు తెలిపారు. బుధవారం చిగురుమామిడి సహకార సంఘం సర్వసభ్య సమావేశం సింగల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి హాజరై సహకార సంఘ సేవల్ని సంఘ పరిధిలో గల రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం సింగల్ విండో చైర్మన్ జంగ వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ సంఘం సభ్యులకు 2021-22 వార్షిక సంవత్సరములో రూ.లు 6.08 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. సంఘము ద్వారా 94 లక్షల విలువైన ఎరువులను రైతులకు సరఫరా చేశామన్నారు. గత యాసంగి, వానాకాలం సీజన్లలో 12 కేంద్రాల ద్వారా 3,65,429.60 క్వింటాళ్ల వరిధాన్యం సేకరించగా సంఘానికి కోటి 16 లక్షల ఆదాయం వస్తుందని వివరించారు. రైతులు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు తీసుకొని అభివృద్ధి చెందడానికి పాలకవర్గం తరఫున సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. 2020-21 సంవత్సరం ఆదాయ వ్యయాలు 2022-23 కి సంబంధించిన అంచనా బడ్జెట్ ను సీఈవో కాటం నర్సయ్య చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో దీర్ఘకాలిక రుణాలు ఇరవై ఐదు లక్షల రూపాయలను చెక్కుల రూపంలో రైతులకు అందచేశారు. అనంతరం యాసంగిలో పండిన ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటూ సంఘ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో సింగిల్విండో ఉపాధ్యక్షుడు కరివేద మహేందర్ రెడ్డి, డైరెక్టర్లు ముద్రకోల రాజయ్య, చిటుమల్ల శ్రీనివాస్, బండి లక్ష్మి, మాచమల్ల లచ్చవ్వ, తాళ్ల పెల్లి తిరుపతి, పోతరవేని శ్రీనివాస్, కూతురు రవీందర్ రెడ్డి, సర్పంచ్ సన్నీల్ల వెంకటేశం, సంఘం సభ్యులు, రైతులు మరియు సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం



**జనగామ మార్చి 28 (ప్రజామంటలు):** ప్రజల సమస్యలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ శివలింగయ్య తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ పురస్కరించుకుని ప్రజావాణి లో పలువురి నుండి 51 దరఖాస్తులు స్వీకరించారు. బచ్చన్నపేట మండలం పోచన్న పేట కు చెందిన నల్ల శ్రావణ్ కుమార్ 2006లో జరిగిన ప్రమాదం తో కాలు కోల్పోయి దివ్యాంగుడుగా జీవితం కొనసాగిస్తున్నానని, దళిత కుటుంబంలో జన్మించి ఉన్నత విద్య అభ్యసించినందున దళిత బంధు పథకం వర్తింప జేయాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. స్టేషన్ఘన్పూర్ మండలం ఇప్పగూడెం కు చెందిన కుంట సోమయ్య సర్వే నెంబర్ 253 లోని 6 ఎకరాల 17 గుంటల భూమిలో ఐదెకరాల 14 గుంటల భూమి మాత్రమే పాస్ బుక్ లో నమోదు అయినది అని మిగిలిన భూమిని కూడా సర్వే చేసి పాస్ బుక్ లో నమోదు చేయగలరని విజ్ఞప్తి అందించారు. జనగామ మండలం చౌడారం కు చెందిన దివ్యాంగురాలు చెరుకూరి కవిత తాను ఎంఎస్సీ బీఈడీ చేశానని వివిధ పనుల నిమిత్తం వెళ్లేందుకు తనకు మూడు చక్రాల స్కూటీ ని మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తిని అందజేశారు. లింగాల ఘనపూర్ మండలం కళ్లెం శివారులో సర్వే నెంబర్ 247, 248 లలో ఉన్న భూమిలో ఎకరం భూమి ఆక్రమణకు గురైందని చర్యలు తీసుకోవాల్సిందిగా రావేల ఎలమంద కలెక్టర్ కు విజ్ఞప్తి అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... సాదా బైనామాకు దరఖాస్తులు స్వీకరించడం లేదని, దివ్యాంగులు సదరన్ కొరకు స్లాట్ బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దళిత జర్నలిస్టుల శిక్షణా కార్యక్రమం లో పాల్గొని ప్రశంసాపత్రాలు స్వీకరించిన జర్నలిస్టులను కలెక్టర్ అభినందించారు. గ్రీవెన్స్ లో అందిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ గ్రీవెన్స్ డే లో అదనపు కలెక్టర్లు భాస్కర్ రావు, అబ్దుల్ హమీద్, జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డిఆర్డిఎ పిడి రామ్ రెడ్డి, ఆర్డివో లు మధుమోహన్, కృష్ణవేణి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించాలి



**జనగామ మార్చి 30 (ప్రజామంటలు):** డాక్టర్ బి.ఆర్. మహాత్మ జ్యోతిరావు పూలే. డాక్టర్ బాబు జగ్జీవన్ రావు ఏప్రిల్ లో జరుగు జయంతి ఉత్సవాలను ప్రభుత్వం జయంతి ఉత్సవాల కమిటీని ఏర్పాటు చేసి ఘనంగా నిర్వహించాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటోస్ సాధన సమితి జాతీయ అధ్యక్షులు జేరిపోతుల పరుశురామ్ జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారి ని మాలతి కి వినతి పత్రం అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జేరిపోతుల పరుశురామ్ మాట్లాడుతూ.... గత రెండు సంవత్సరాల నుండి కరోనా కారణంగా మహనీయుల జయంతి ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించ లేదని, ఈసారి రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలో జయంతి ఉత్సవాల కమిటీని ఏర్పాటు చేసి ఘనంగా నిర్వహించాలని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ఈ దేశ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావ్ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను నిర్వహించి వారి త్యాగాలను ముందుకు తీసుకుపోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ ఉపాధ్యక్షులు గిరిమల్లె రాజు, అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి నిర్మల రాములు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బోట్ల శేఖర్, కందుకూరి ప్రభాకర్, ఊడుగుల సాగర్ పాల్గొన్నారు.

# జనగామ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



జనగామ మార్చి 30 (ప్రజామంటలు): జనగామ జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక జెడ్పీ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో పండిన రబీ వరి ధాన్యాన్ని మొత్తం కేంద్ర ప్రభుత్వం కోనుగోలు చేయ్యాలని, ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. వ్యవసాయ బావుల పంపుసెట్లకు మీటర్లు బిగించరాదని ఏకగ్రీవంగా తీర్మానించారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రధాని నరేంద్ర మోడీని కోరుతూ జిల్లా పరిషత్ అత్యవసర సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. మా జనగామ జిల్లాలోని రైతులు యాసంగిలో పండించే ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, గిరిజనుల కోసం 10 శాతం రిజర్వేషన్లు పెంపు బిల్లును ఆమోదించి చట్టం తేవాలని, పెంచిన వంటగ్యాస్, పెట్రోల్ మరియు డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానం చేశారు. ఈ సర్వసభ్య సమావేశానికి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, జిల్లా రైతు బంధు అధ్యక్షులు రమణ రెడ్డి, అదనపు కలెక్టర్ హమీద్, జెడ్పీ సిఇఓ విజయలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి, జిల్లా జెడ్పీటీసీలు, ఎంపిపిలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపికి ప్రజల ఆదరణ తగ్గలే

**టిడిపి పూర్వవైభవానికి కృషి**

**తెదేపా జిల్లా అధ్యక్షులు మహంకాళి రాజన్న**




జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు): తెలుగుదేశం పార్టీలోంచి నాయకులు పోయినా ప్రజల్లో ఆదరణ తగ్గలేదని టిడిపి జిల్లా అధ్యక్షులు మహంకాళి రాజన్న అన్నారు. బుధవారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో ప్రకటన విడుదల చేశారు. తెలుగుదేశం పార్టీ సంక్షేమం, సంస్కరణలు, అభివృద్ధి ఏజండాతో పరిపాలన సాగిందన్నారు. ఇదే పార్టీలో ఎందరో చేరారని వారందరికీ రాజకీయ శిక్షణనిచ్చిందన్నదన్నారు. ఎందరో నాయకులను తయారుచేసిన టిడిపిలో నుంచి నాయకులు పోయినా ఇప్పటికి ప్రజల్లో టిడిపికి ఆదరణ తగ్గలేదన్నారు. టిడిపి పార్టీ ఆవిర్భావం రోజున చంద్రబాబు చేతుల మీదుగా సన్మానం పొందడం సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు చేతుల మీదుగా జగిత్యాలలో పార్టీ కార్యాలయంను ప్రారంభింప చేస్తామని చెప్పారు. టిడిపికి పూర్వవైభవానికి నిరంతరం కృషిచేస్తామని మహంకాళి రాజన్న చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొండ్ర శ్రీధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి కాశినాథమ్, బత్తుల కొండయ్య, ఒరుగంటి భార్గవ రామ్, పెద్దిరాజం, న్యాయవాది విజయ్ కుమార్ లు ఉన్నారు.



## వీరభద్రుడి హుండీ లెక్కింపు

**భీమదేవరపల్లి మార్చి 30 (ప్రజామంటలు):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు జరిగింది. ఇందులో 7,04,383 నోట్లు, 40,321 కాయిన్స్ కలిపి మొత్తం 7,44,704/- ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో ఏ. మారుతి, చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, ధర్మకర్తలు, శ్రీనివాస సేవా సమితి సభ్యులు, దేవస్థాన సిబ్బంది మరియు అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

## బీరప్ప పట్నాలకు హాజరైన టీఆర్ఎస్ నాయకులు



**కొడిమ్యాల మార్చి 30 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండలంలోని నర్సింహులపల్లి గ్రామంలో జరుగుతున్న బీరప్ప పట్నాలకు ముఖ్య అతిధిగా విచ్చేసినజెడ్పిటిసి పునుగోటి ప్రశాంతి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కృష్ణారావు, కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజ నర్సింగా రావు, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడే ఉచిత స్పెషియాలిటీ వైద్య శిబిరం

**జనగామ మార్చి 30 (ప్రజామంటలు):** లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ ఆధ్వర్యంలో శ్రీనివాసా నర్సింగ్ హెూం సౌజన్యంతో గురువారం ఉచిత స్పెషాయాలిటీ వైద్య శిబిరం నిర్వహించ నున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ఫజ్జురి లక్ష్మీ నర్సయ్య తెలిపారు. పూర్వ జిల్లా గవర్నర్ డా. డి. లవకుమార్ రెడ్డి మార్గదర్శనంలో నిర్వహించే ఈ శిబిరంలో ప్రముఖ ఫిజిషిన్, దయాబెటలాజిస్ట్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డా. ప్రియతమ్ రెడ్డి కన్సల్టేషన్ ఉచితంగా నిర్వహించి సలహాలు ఇస్తారని, ఈ శిబిరంలో ఇసిజి, షుగర్ పరీక్షలు ఉచితంగా చూస్తారని తెలిపారు. ఉదయము 9 గం. లకు శ్రీనివాసా నర్సింగ్ హెూం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఉప జిల్లా గవర్నర్ కన్న పరశురాములు ప్రారంభిస్తారని అవసరార్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

## భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం 'లింగంగుట్ట శివయ్య'



**లింగంగుట్ట (నవీపేట్) మార్చి 30 (ప్రజామంటలు):** స్థానిక సర్పంచ్ నిజామాబాద్ జిల్లా సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు, శ్రీనివాస్ మాసశివరాత్రి సందర్భంగా నవీపేట్ లో గల లింగంగుట్ట స్వయంభు శివాలయంను దర్శించుకుని శ్రీశ్రీశ్రీ రాజ యోగి సిద్దేశ్వర మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం దేవాలయ అభివృద్ధి గురించి స్వామి వారితో, ఆలయ అభివృద్ధి కమిటీతో చర్చించారు. అనంతరం సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, భక్తుల కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం లింగంగుట్ట పశ్చిమ ముఖము ఆ పరమ శివుడు అని, ఆయన అన్నారు. భక్తులు పిలిస్తే పలికే దైవం లింగంగుంట శివయ్య మన ప్రాంతంలో స్వయంభుగా వెలవడం మన ప్రాంతవాసుల అదృష్టం అన్నారు. అనతి కాలంలోనే లింగంగుంటకు భక్తులు జిల్లాలో నుండి కాకుండా రాష్ట్ర నలుమూల నుండి మరియు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర కర్ణాటకల నుండి రావడం స్వామివారి విశిష్టతకు నిదర్శనం అన్నారు. అంతే కాకుండా ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి ఎల్లవేళలా అందిస్తూనే ఉంటానని తెలిపారు. ఆలయ అభివృద్ధికి పాల్పడిన సర్పంచ్ శ్రీనివాస్ ఆలయ అభివృద్ధి కమిటీ ఘన సన్మానం చేశారు.

## బుల్లెట్ బండి పాటకు వెయ్యి మంది డ్యాన్స్ కు ఉగాది పురస్కారం

**పురస్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయి**

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్**

జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు): పురస్కారాలు మరింత బాధ్యతన పెంచుతాయని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉగాది సంబరాలను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి ఆధ్వర్యంలో ధర్మపురి నియోజకవర్గ పరిధిలో అందజేశారు. పలు విశిష్ట సేవలందించిన, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు చేసిన నిర్వాహకులకు అందజేశారు. కాగా జగిత్యాల జిల్లా కేంద్రంలో గత నెలలో బుల్లెట్ బండి పాటకు వెయ్యి మంది డ్యాన్స్ తో మినీ స్టేడియంలో ఇంటర్నెషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించారు. ఈ సందర్భంగా యూట్యూబ్ 'మచ్చ రవి' కి ఉగాది పురస్కారం ను రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ స్నేహలత దంపతులు శాలువతో సన్మానించి ఉగాది అందజేశారు. ఈ సందర్భంగా ఇంటర్నెషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన మచ్చ రవి ఉగాది పురస్కారం అందజేశారు. కాగా పద్మశాలి యువజన సంఘం జిల్లా నాయకులు ఆకుబత్తిని జయంత్ నేత ప్రత్యేక అభినందనలు తెలిపారు.



## అరవింద్ నగర్ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ వారిచే పంచాంగ వితరణ



**జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు):** అరవింద నగర్ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ వారిచే బుధవారం బ్రాహ్మణ వీధి శ్రీ రామ మందిరం లో శుభకృతు నామ సంవత్సర పంచాంగములు బ్రాహ్మణులకు అందజేశారు .పట్టణ పురోహితులు రుద్రంగి గోపాలకృష్ణ , కంజర్ల అనంతాచార్యులు, సముద్రాల రవీంద్ర చారి ,బండపల్లి ప్రసాద్ శర్మ పంచాంగ దాతల చే పూజలు చేయించారు. అనంతరం ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు అనంతుల రాంకిషన్ ,బొడ్ల మనోహర్, జైశెట్టి రాజశేఖర్, కొత్తపెల్లి నాగభూషణం, కొత్తపెల్లి శ్రీనివాస్, నూనె రాధాకృష్ణ, కె.ఎల్.వి. కృష్ణ, పూటూరి ఉమాపతి, జిల్లా సత్యం, పాల్తేపు శంకర్, ఎలిమేల చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం కేసిఆర్ ప్రభుత్వ లక్ష్యం

**సంక్షేమ శాఖల మంత్రి ఈశ్వర్**



**ధర్మపురి మార్చి 30 (ప్రజామంటలు):** వ్యవసాయాధారిత నూతన తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ, రైతుల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా సీఎం కేసిఆర్ ఎన్నో రైతు ప్రాయోజిత కార్యక్రమాలు చేపట్టడం జరుగు తున్నదని రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం ధర్మపురిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మిషన్ కాకతీయ చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంగా 300.43 లక్షల అంచనా వ్యయంతో అక్కపల్లి చెరువు పునరుద్ధరణ పనులను ప్రారంభించి, అనంతరం ధర్మపురి పట్టణ లో జాతీయ రహదారి నుండి వయా జూనియర్ కాలేజీ.. సర్దార్ వల్లబాయ్ పటేల్ విగ్రహం వరకు, వరకు 104 లక్షల అంచన వ్యయం తో సి.సి రోడ్డు, అలాగే నేషనల్ హైవే నుండి సబ్ స్టేషన్... హరిత హోటల్... స్మశానవాటిక వరకు 131 లక్షల అంచన వ్యయంతో సి.సి రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన గావించారు. కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ దేశానికి ఆదర్శవంతంగా సంక్షేమ పాలన సీఎం కేసీఆర్ అందిస్తున్నారని తెలిపారు. దేశంలోనే రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. అక్కపల్లి చెరువు పునరుద్ధరణ పనులను పూర్తి అయితే రైతులకు వరంగా మారనుందని, ధర్మపురి పట్టణంలో పాటు నాగారం, కమలాపూర్, బుద్దేశ్ పల్లి, నర్సయ్య పల్లి, తాగు సాగు సమస్య తీరనుందన్నారు.మొదటి దశ లో ఈ చెరవును పూడిక తీయడం వల్ల ధర్మపురిలో భూగర్భ జలాలు బాగా పెరుగుతాయని మంత్రి వివరించారు. అక్కపల్లి చెరువు పునరుద్ధరణ పనులను పూర్తి అయితే రైతులకు వరంగా మారనుందన్నారు. ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మీ షాదీ ముబారక్, రైతు బంధు ,రైతు బీమా, దళిత బంధు, కెసిఆర్ కిట్, 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని మంత్రి తెలిపారు. గ్రామ మహిళల చెరువుకు రెండు బతుకమ్మ ఘాట్ నిర్మించాలని కొరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. దాదాపు 5 కోట్ల 36 లక్షల నిధుల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ చిట్టిబాబు జెడ్పీటీసీలు అరుణ, మునిసిపాలిటీ చైర్ పర్సన్ సంగి సత్తమ్మ, మాజీ మార్కెట్ చైర్మన్ అయ్యోరి రాజేష్, సర్పంచ్ చిన్న నర్సమ్మ, కౌన్సిలర్ లు పాల్గొన్నారు.

## "మన ఊరు - మన బడి" కి విశేష స్పందన



**తరిగొప్పుల మార్చి 30 (ప్రజామంటలు):** మండలంలోని నర్సాపూర్ గ్రామంలో మన ఊరు - మన బడి" కి విశేష స్పందన. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలు కూడా పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్న విజ్ఞప్తి మేరకు గ్రామ సర్పంచ్, ఎస్ఎంసి చైర్మన్ రజిత, ఎస్ఎంసి వైస్ చైర్మన్, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు సహృదయంతో ఈ క్రింది విరాళాలు అందించారు. అల్లిబిల్లి ప్రసాద్ కుమార్, ఆంధ్రజ్యోతి విలేఖరి - 41" ఎల్ఈడి టీవీ (దాని విలువ 15 వేల రూపాయలు), సర్పంచ్ బెల్లం రాజు - రూ.5116o ఎలక్ట్రిక్ బెల్, ఎస్ ఎం సి చైర్ పర్సన్ అమరాజు రజిత - ఒక బీరువా, బబ్బుల సంపత్ డ్రమ్స్, తుపాకుల శ్రీనివాస్ రూ.2016/ అల్లిబిల్లి స్వప్న, ఎస్ఎంసి వైస్-చైర్మన్- రూ.2016/ తుపాకుల శ్రీనివాస్ రూ.2016/ అల్లిబిల్లి మహేందర్, ఉపసర్పంచ్ రూ.1116/ డి అనిల్ కుమార్, పంచాయత్ సెక్రటరీ- 6 వాల్ క్లాక్స్ ఈ సమ్మయ్య రూ.1116/ కుమార్ రూ.1116/ అందించగా వీరందరికీ పాఠశాల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతూ ఇదే విధంగా అందరూ ముందుకు రావాలని కోరుతున్నాము. ఎస్ఎంసి ఎస్ ఎస్ సి చైర్మన్ హెచ్ఎం పానికుమారు నర్సాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల పక్షాన కృతజ్ఞతలు.

## రాగంపేటలో పౌరహక్కుల దినోత్సవం



**చొప్పదండి మార్చి 30 (ప్రజామంటలు):** పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా చొప్పదండి మండలము లోని రాగంపేట గ్రామము నందు సర్పంచ్ మామిడి లత రాజేశం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమనికి ముఖ్యఅతిథిలుగా మండల అధ్యక్షులు, చిలుక రవీందర్ పాల్గొని, మాట్లాడుతూ.... ఈ గ్రామంలో కులమతాలకు అతీతంగా ప్రజలు కలసి మెలసి ఉంటారని, అభివృద్ధి కార్యక్రమాలు అందరు కలిసి మెలసి చేయడం ఆదర్శప్రాయమని, ఇలాంటి సఖ్యతను పాటిస్తుతున్న అన్ని సంఘాలను, ప్రజలను తను చాల అభినందిస్తున్నానని, కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి కార్యక్రమములో ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణ రెడ్డి, ఎంఆర్ఓ ఏ. రజిత, ఎంపిడిఓ స్వరూప, ఏఎస్ఐ రాజయ్య, ఎంపిఓ రాజగోపాల్ రెడ్డి, వార్డ్ సభ్యులు దికొండ సురేష్, సోనియా కుమార్, అంబెద్కర్ సంఘము అధ్యక్షుడు గసికంటి అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి కూటి కల మహేష్, ఎస్సి కుల సంఘం పెద్దలు హాజరయ్యారు.

# ప్రజల మనిషి "పరిపాటి జనార్దన్ రెడ్డి"



తొలిదశ తెలంగాణ ఉద్యమనాయకుడు, కమలాపూర్ మాజీ ఎమ్మెల్యే, హుజురాబాద్ పాత తాలూకాలో "ప్రజల మనిషి" గా గుర్తింపు కలిగిన పరిపాటి జనార్దన్ రెడ్డి మరణంతో తెలంగాణ రాష్ట్రం పాత తరానికి చెందిన ఒక రాజకీయవేత్తను,సామాజిక స్పృహ కలిగిన నాయకున్ని కోల్పోయింది. 87 ఏళ్ల వయస్సులో జనార్దన్ రెడ్డి హైదరాబాద్ లో చనిపోగా,నిన్న సాయంత్రం అక్కడే అంత్యక్రియలు జరిగాయి. ఆయనకు ముగ్గురు కుమారులు. ప్రస్తుత వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి (కల్లుపల్లి) గ్రామానికి చెందిన జనార్ధన రెడ్డి ఆయన అన్నగారైన ప్రముఖ సోషలిస్ట్ నాయకుడు పరిపాటి ఉమారెడ్డి తో ప్రభావితమై సోషిలిస్ట్ భావాలకు ఆకర్షితులైనారు. ఉమారెడ్డి వరంగల్ మున్సిపాలిటీ చైర్మన్ గా,వరంగల్ ఎమ్మెల్యే గా కూడా పనిచేశారు. జమ్మికుంట ప్రాంతంలోని భూస్వాములను ఎదుర్కొని ఆ రోజుల్లో ఎదిగి వచ్చిన కొత్త తరం రాజకీయ యువతరానికి జనార్దన్ రెడ్డి గారు నాయకత్వం వహించారు.ఆ రోజుల్లో జమ్మికుంట గ్రామానికి చెందినమాజీ సర్పంచ్ ఎర్రంరాజు కృష్ణం రాజు,ఉప్పల్ గ్రామానికి చెందిన పుల్ల ఏలీయా లాంటి వారు జనార్దన్ రెడ్డి గారికి ముఖ్య అనుచరులుగా వుండేవారు.అలాగే హుజురాబాద్ తాలూకా లోని సోషలిస్ట్ నేతలు పోలసాని నరసింగరావు,దుగ్గిరాల వెంకట రావు, అలిగిరెడ్డి కిషన్ రెడ్డి,హుజురాబాద్ మాజీ సర్పంచ్,అప్పట్లో హుజురాబాద్ లో న్యాయవాది గా ఉన్న బి.జగన్నాథ నాయుడు లాంటి వారితో సన్నిహిత సంబంధాలు వుండేటివి.

1969 లో కొనసాగిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జనార్దన్ రెడ్డి గారు కీలక పాత్రను నిర్వహించారు. నేను ఆ రోజుల్లో హుజురాబాద్ తాలూకా విద్యా ర్థి సంఘం నాయకునిగా ఉండేవాడిని. ఆనాటి తెలంగాణ ఉద్యమం సందర్భంగా జనార్దన్ రెడ్డి అరెస్టై కరీంనగర్ జైల్లో ఉండగా అదే సందర్బంగా నేను, నాతోపాటు మరో ఐదుగురం కూడా అరెస్టై అదే జైలుకు వెళ్లడం జరిగింది. మేం జైల్లో ఉన్నప్పుడే కరీంనగర్ లో భూమి కంపించి, జైల్లో ఉన్న మేం భయభ్రాంతులకు గురయ్యాము. అప్పుడు జనార్దన్ రెడ్డి మాకు ఎంతో ధైర్యాన్ని అందించారు. హుజురాబాద్ పంచాయతీ సమితి అధ్యక్షునిగా పనిచేసిన పరిపాటి జనార్దన్ రెడ్డి 1972 లో స్వతంత్ర అభ్యర్థిగా కమలాపూర్ నియోజకవర్గం నుండి పోటీ చేసి తొలిసారిగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని శాసనసభలో అడుగుపెట్టారు. ఈ టర్మ్ లోనే ఒకసారి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడు నేను,నాటి నాతోటి తెలంగాణ ఉద్యకారుడు మహమ్మద్ అబ్దుల్ కరీం కలసి హైదరాబాద్ లో ఉన్న జనార్దన్ రెడ్డి గారిని కలవడం జరిగింది.ఆయన మమ్మల్ని అసెంబ్లీ సమావేశాలను చూసేందుకు తీసుకువెళ్లి ప్రెస్ గ్యాలరీ లో కూర్చోబెట్టారు.ఆ సమావేశాల్లో నే పుచ్చల పల్లి సుందరయ్య, గౌతు లచ్చన్న లాంటి నేతలను చూసే అవకాశం మాకు కలిగింది. 1978 లో జరిగిన ఎన్నికల్లో జనతా పార్ట్ అభ్యర్థిగా పోటీ చేసి జనార్దన్ రెడ్డి గారు మళ్లీ కమలాపూర్ నియోజకర్గం నుండి గెలుపొందారు. హుజురాబాద్ లో గ్రామ నవనిర్మాణ సమితిని,జమ్మికుంట లో హింద్ కుష్టు నివారణ సంస్థను,అలాగే కృషివిజ్ఞాన్ కేంద్రాలను స్థాపించి అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించారు. పౌర హక్కుల సంఘం అధ్యక్షులుగా పనిచేసిన ప్రముఖ న్యాయవాది కె.జి. కన్నాభీరాన్, తొలి తరం తెలంగాణ ఉద్యమకారులు ప్రొ. కేశవరావు జాదవ్ గార్లతో కలసి జనార్దన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతోను, పౌర హక్కుల ఉద్యమంతోను మమేకమై నడిచారు. అప్పట్లో హుజురాబాద్ కేంద్రంగా గ్రామ నవనిర్మాణ సమితి పక్షాన జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో, సమితి ప్రధాన కార్యదర్శి ముద్దసాని సత్యనారాయణ రెడ్డి నిర్వహణలో కొనసాగిన అనేక కార్యక్రమాలను నేను ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ గా రిపోర్ట్ చేస్తుండేవాడిని. ఆ సందర్భంలో జనార్దన్ రెడ్డి తో, సత్యనారాయణ రెడ్డి తో వివిధ అంశాలపై నేను చర్చించేవాడిని. ప్రజల మనిషి పరిపాటి జనార్దన్ రెడ్డి గారిని స్మరించుకుంటూ...జనార్దన్ రెడ్డి అమర్ రహే...ఆవునూరి సమ్మయ్య సీనియర్ జర్నలిస్ట్

## దేశానికి ఆదర్శంగా రైతు సంక్షేమ పథకాల అమలు

**యాసంగి పూర్తి ధాన్యం కేంద్రం కొనుగోలు చేయాలని ఏకగ్రీవ తీర్మానం మంత్రి కొప్పుల ఈశ్వర్**



**ఎన్టీపీసీ మార్చి 30 (ప్రజామంటలు):** దేశానికి ఆదర్శవంతంగా రైతు సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం ఎన్టిపిసిలోని మిలినియం హల్ లో జడ్పీ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి పాల్గొన్నారు. నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ రైతు సంక్షేమం దిశగా అనేక చర్యలు చేపట్టారని మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతులకు కనీసం 6 గంటల విద్యుత్ సరఫరా జరిగేది కాదని, ప్రస్తుతం సీఎం కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్ రైతులకు అందిస్తున్నారని తెలిపారు. రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని, కరోనా సంక్షోభ సమయంలో సైతం రైతులకు సకాలంలో రైతుబంధు నిధులు విడుదల చేస్తున్నామని, ఇప్పటివరకు 63 లక్షల రైతులకు రైతు బంధు పథకం కింద 50 వేల కోట్ల పైగా నిధులను బ్యాంకు ఖాతాలో జమ చేసామని మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న నీటి తీరువా బకాయిలు రద్దు చేశామని, తెలంగాణలో పూర్తిగా నీటి తీరువా ను సీఎం కేసీఆర్ రద్దు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ప్రతి రైతుకు రూ.5 లక్షల బీమా కు ప్రభుత్వం ప్రీమియం చెల్లిస్తూ రైతు బీమా పథకం అమలు చేస్తుందని మంత్రి గుర్తు చేశారు. ప్రతి 5 వేల ఎకరాలకు క్లస్టర్ ఏర్పాటు చేసి, పంటలపై రైతులకు అవగాహన కల్పించేందుకు పరస్పరం చర్చించేందుకు రైతు వేదికలను సీఎం కేసీఆర్ నిర్మించారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో రైతులకు సాగు నీటి కష్టాలు తీర్చేందుకు రికార్డు సమయంలో అతిపెద్ద కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారని మంత్రి తెలిపారు. శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకం, దేవాదుల పథకం, కల్వకుర్తి నెట్టెంపాడు వంటి 23 సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేస్తున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై దేశంలో ఎక్కడా లేని విధంగా పీడీ యాక్ట్ అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాల వల్ల రైతుల పరిస్థితి మెరుగుపడుతుందని, దీని పట్ల అసూయతో కేంద్ర ప్రభుత్వం విష పూరిత వైఖరి అవలంబిస్తోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో యాసంగి సీజన్ లో పండే ధాన్యం నుంచి రా రైస్ తయారు కాదని ఇప్పుడు బియ్యం మాత్రమే తయారవుతుందని మంత్రి స్పష్టం చేశారు రైతులను ఎద్దేవా చేసే ధోరణితో కేంద్ర ప్రభుత్వం కేంద్ర మంత్రి వ్యవహరిస్తున్నారని, కేంద్రం తన బాధ్యత నుంచి తప్పుకోవడానికి వీల్లేదని పూర్తి స్థాయిలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పండించిన ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం పంజాబ్ తరహాలో పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని జడ్పీ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది. తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వం తో ధాన్యం కొనుగోలు చేయిస్తామని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. జడ్పీ చైర్మన్ పుట్ట మధు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కుమార్ దీపక్, గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్, జిల్లా అధికారులు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సంబంధిత అధికారులు తదితరులు, ప్రజా ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# గాయత్రి బ్యాంకు సేవలు అమోఘం



**ధర్మపురి మార్చి 30 (ప్రజామంటలు):** ధర్మపురి గాయత్రి బ్యాంకు శాఖ సేవలు అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు, ధర్మపురి శాఖ యందు జరిగిన ఒక కార్యక్రమంలో, ప్రమాద వశాత్తు మరణించిన గాయత్రి బ్యాంకు ఖాతాదారులు బండారి గంగన్న భార్య అయిన బండారి లక్ష్మికి 1 లక్ష రూపాయల చెక్కును రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, బ్రాంచి మేనేజర్ కె. సిహెచ్ వెంకన్న చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ వినియోగ దారులకు నమ్మకమైన బ్యాంకింగ్ సేవలందిస్తూ వారి ఆర్థిక ప్రగతికి సహకారం అందిస్తున్నదని అభినందించారు. ఖాతాదారులకు కనీస డిపాజిట్ లోనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ పేద, మధ్య తరగతి వినియోగ దారులకు ప్రమాద భీమా కల్పిస్తూ వారికి అందగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. ఎ టి ఎం లలో నగదు అన్ని వేళలా అందుబాటులో ఉంచడం ద్వారా ధర్మపురి, పరిసర ప్రాంత ప్రజల నగదు అవసరాలను తీరుస్తున్నదని అన్నారు. బ్రాంచి మేనేజర్ కె. సిహెచ్. వెంకన్న మాట్లాడుతూ బ్యాంకు వినియోగ దారులకు తక్కువ వడ్డీకే బంగారు ఆభరణాలపై గ్రాముకు అత్యధికంగా రూ. 1,200/- తో బంగారు అందిస్తున్నామని, అలాగే UPS (Unified Payatient Interfac), సేవల ద్వారా BHIM, Patter, Google Pay, | Pay Phonelle వంటి వాలెలో (యాప్స్) మన బ్యాంకు ఖాతాల లావాదేవీ లను జరుప వచ్చునని వివరించారు. బ్యాంకు యొక్క (కస్టమర్ సర్వీస్ పాయింట్) బ్యాంకు కరస్పాండెంట్స్ ఇటీవల నియమించి వినియోగదారుల చెంతకు బ్యాంకు సేవలను తీసుకు వచ్చామని తెలియ జేశారు. సేవింగ్ ఖాతాలు ప్రారంభించుటకు కావలసిన ఫోటో మరియు జిరాక్స్ ను బ్యాంకు యందే ఉచితంగా అందిస్తున్నామని వినియోగ దారులు ఇట్టి సౌకర్యాలను వినియోగించు కోవాలని కోరారు.

# ముడి సరుకు ధరల పెరుగుదల

**4 రోజులు ప్రింటింగ్ ప్రెస్ లు బంద్**



**జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు):** ముడిసరుకుల ధరలు మునుపెన్నడూ లేనివిధంగా పేపర్ పెల్లి పత్రికల ధరలు ముడి సరుకులతో పాటు కరెంటు చార్జీలు కూడా గణనీయంగా పెరిగిన ధరలు పెంచక తప్పడం లేదు. జిల్లా ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వర్తక సంఘ భవనంలో సమావేశం ఏర్పరచుకొని తేదీ 1-4-2022 నుండి తేదీ 4-4-2022 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రింటింగ్ ప్రెస్ లు బంద్ పాటించాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. తేదీ 4-4-2022 నుండి కొత్త ధరలు అమల్లోకి వస్తాయని తెలియ పరచడమైనది. ఇట్టి సమావేశమునకు జిల్లా అధ్యక్షులు ముసిపట్ల లక్ష్మీనారాయణ ప్రధాన కార్యదర్శి ఎలిగేటి శ్రీనివాస్ మరియు కోరుట్ల మెట్పల్లి ధర్మపురి రాయికల్, మల్యాల, గొల్లపల్లి పట్టణ సభ్యులతో పాటు జగిత్యాల పట్టణ ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎలిగెటి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పొలసాని మల్లికార్జున్ కోశాధికారి బానుక మహేష్ సభ్యులు పాత వేణు, ఎర్ర రమేష్ ఎర్ర శివ, రత్నాకర్, పెండెం గంగాధర్ ఉపాధ్యక్షులు అనుమల్ల శ్రీనివాస్, పెండెం జలపతి మస్తాన్, లింగారెడ్డి, సత్యం, రామకృష్ణ, వరుణ్, చంద సత్తయ్య, పడిగెల శివకుమార్, ఉషకోల ప్రసాద్, గోలి మధుకర్, మేటుపెల్లి సభ్యులు, రాయికల్ మారుతి పాల్గొన్నారు.

## సిపిఎస్ విధానంను రద్దు చెయ్యాలి

**పాత పెన్షన్ పథకం ను పునరుద్ధరణ చెయ్యాలి**



**ధర్మపురి మార్చి 30 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎనభై వేయిల ముప్పై తొమ్మిది ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్లు ప్రకటన చెయ్యడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ తెలంగాణ రాష్ట్రం లో గౌరవ ముఖ్యమంత్రి పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తున్నట్లు ప్రకటన చెయ్యాలని కోరుతూ ధర్మపురి లో నేడు ధర్మపురి పట్టణ కేంద్రం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికల) లో జరుగుతున్న శిక్షణ కేంద్రంలో తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కోర్సు డైరెక్టర్ రాజయ్య కు వినతిపత్రం సమర్పించారు.(ఈ సందర్భంగా టిఎస్సిపిఎస్ఈయూన రాష్ట్ర ఉపాధ్యక్షులు మ్యాన పవన్ కుమార్ మాట్లాడుతూ.... గౌరవ తెలంగాణ ముఖ్యమంత్రి అసెంబ్లీ లో ఎనభై వేయిల ముప్పై తొమ్మిది ఉద్యోగాల ప్రకటించిన నోటిఫికేషన్లు ప్రకటన హర్షణీయం కొనియాడుతూ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఒక లక్ష డెభై రెండు వేల రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులకు 2004 నుంచి సీపీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నాయని ఆ విధానం లోపభూయిష్టంగా ఉందని నేడు రాజస్థాన్, ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వాలు పాత పింఛన్ విధానంపై నిర్ణయం తీసుకొని సిపిఎస్ విధానం ను రద్దు చేశాయని ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక, సామాజిక భద్రత చేకూర్చాలంటే అన్ని రాష్ట్రాల్లోనూ పాత పెన్షన్ ను పునరుద్ధరించాలని కోరుతున్నామని రాష్ట్రంలో కూడా సీపీఎస్ రద్దు దిశగా అడుగులు వేసి దేశానికే మన ముఖ్యమంత్రి గారు ఆదర్శంగా నిలిచేలా వెంటనే పాత పెన్షన్ ను పునరుద్ధరణ చేసి సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయ బంధుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్సిపిఎస్ఈయూల ధర్మపురి, బుగ్గారం మండల అధ్యక్షులు బండారి సతీశ్, సిర్ర శ్రీనివాస్, మామిడి సంతోష్, రాపర్తి రాజేష్, కాశెట్టి వెంకటరమణ, సాధు శ్రీకాంత్, సంద వెంకటేష్, సందరికారి రాజేష్, దొంతుల శ్రీధర్, శీలం నర్సయ్య, బుగ్గారపు హరీష్, ఒజ్జల మహేష్, తిరుపతి, విజయలక్ష్మి, సునీత, శ్రీలత, శ్రీత, సింధూజ, అనిత, భాగ్య లక్ష్మీ, అనూష స్వర్ణకుమారి, రోజా తదితరులు పాల్గొన్నారు.

# ముదురుతున్న ఎండలు

**నిర్లక్ష్యంలో జీహెచ్ఎమ్సీ అధికారులు**

**మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి**



**సికింద్రాబాద్ మార్చి 30 (ప్రజామంటలు):** ఓ వైపు ఎండలు ముదురుతుండగా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నరని, కాని ప్రభుత్వం, జీహెచ్ఎమ్సీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మర్గకరమని మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలసి అమీర్పేట లోని జీహెచ్ఎమ్సీ వెల్నెస్ సెంటర్ లోని స్విమ్మింగ్ పూల్ ను సందర్శించారు. పూల్ లో ఒక్క చుక్క నీరు లేకపోవడం చూసి విస్మయం చెందారు. ఎప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారులు ట్యాక్స్ కలెక్షన్లు, బార్లు, పబ్లకు అనుమతి, కమిషన్లపైనే రోజంతా బిజీగా ఉండి ప్రజసంక్షేమాన్ని గాలికొదిలేస్తున్నారని విమర్శించారు. అమీర్పేట లోని వెల్నెస్ సెంటర్ ను అటు సనత్ నగర్ ఎమ్మెల్యే గాని, ఇటు కార్పొరేటర్ గాని పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైన ప్రజల శ్రేయస్సుపై దృష్టి సారించాలని ఆయన కోరారు.

## రసాయనిక ఎరువులు వాడకం వద్దు



**తరిగొప్పుల మార్చి 30 (ప్రజామంటలు):** లోడ్ సాంఘిక సేవ సంస్థ ఆధ్వర్యంలో మనోస్-యుని దాన్ ఆదేశాల మేరకు తరిగొప్పుల మండలం లోని చుట్టుపక్కల తండాలలో నీ మహిళలకు ఓపియం/ఎన్ పియం వాటి గురించి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న లోడీ సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడడం వల్ల నష్టాలకు గురవుతున్నారు. కావున ఆర్గానిక్ ఎరువులు, కంపోస్టు ఎరువులు, పెంట, గొర్రెల ఎరువు, వేప పిండి, జీవామృతం నల్లరేగడి ఇలాంటివి వాడి పంట దిగుబడి పెంచుకోవాలని మరియు భూముల సారని పెంచి భావి తరాలకు మంచి భూమిని అందించాలని కోరారుకోరారు. ఈ కార్యక్రమంలో లోడి సాంఘిక సేవా సంస్థ వారు సత్యనారాయణ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్‌లో సీటు పొందిన సన్నిహిత, ఐశ్వర్య...

**సరస్వతి పుత్రికలకు పేదరికం అడ్డు...**



గాంధీనగర్ గ్రామానికి చెందిన తాళ్లపెల్లి సన్నిహిత, ఐశ్వర్య కు రంగారెడ్డి జిల్లా ఎంఎన్ఆర్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్ వచ్చింది. ఐతే వీరికి అడ్మిషన్, హాస్టల్, బుక్స్ కోసం ఇద్దరికి రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుంది. సన్నిహిత తండ్రి తాళ్లపెల్లి రవీందర్ కూరగాయల వ్యాపారం చేస్తూ, ఐశ్వర్య తండ్రి తాళ్‌పెల్లి కొటేశ్వర్ కమలాపూర్ పెట్రోల్ బంక్ లో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్నారు. ఈ సెల్ నంబర్లకు 7993609199బీ 9963443489 దాతలు సహకారం అందించాలని కోరుతున్నారు.

## ముదిరాజ్ సమితి అధ్వర్యంలో మహాచండీ యాగం



**సికింద్రాబాద్ మార్చి 30 (ప్రజామంటలు):** ముదిరాజ్ ల సంక్షేమాన్ని కాంక్షిస్తూ, ఈమేరకు ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ ముదిరాజ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో బుధవారం శామీర్ పేట లో అమ్మవారి మహా చండీ యాగాన్ని నిర్వహించారు. రాష్ట్ర జనాభా లో అధిక శాతం ఉన్న ముదిరాజ్ లు అనేక రంగాల్లో వెనకబడి ఉన్నారని, దీనికి కారణం ప్రభుత్వం ముదిరాజ్ లపై చూపుతున్న నిర్లక్ష్యమే అని ముదిరాజ్ సంక్షేమ సమితి అధ్యక్షులు సురేశ్ ముదిరాజ్, జాతీయ కోలీ సమాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్ లు అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వానికి ముదిరాజ్ ల సంక్షేమం గురించి పట్టించుకునేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు వారు పేర్కొన్నారు. వరుణ్ తేజ్ స్వామి ఆధ్వర్యంలో మహా చండీ యాగాన్ని నిర్వహించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com